

సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పంచమసాలి మఠాధిపతి బసవ మృత్యుంజయ స్వామి తదితరులు

తెరపైకి 'పంచమసాలి రిజర్వేషన్'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని లింగాయత పంచమసాలి సామాజిక వర్గానికి రిజర్వేషన్- 2ఎ జాబితాలో చేర్పించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తన అధికార కార్యాలయమైన 'కృష్ణ'లో శుక్రవారం పంచమసాలి సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశమయ్యారు. చట్టప్రకారం రిజర్వేషన్ కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించి ఓ నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. విధానసభ ఉప ఎన్నికల నిబంధనల నేపథ్యంలో న్యాయ నిపుణులతో సమావేశం నిర్వహించడం అసాధ్యమన్నారు. ఉప ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత వారితో చర్చిస్తానని బదులిచ్చారు. సమావేశంలో పంచమసాలి మఠాధిపతి బసవ మృత్యుంజయ స్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, శివరాజ్ తంగడగి, శాసనసభ్యులు వినయ్‌కులకర్ణి, విజయానంద కాశప్పనవర్, బసనగౌడ పాటిల్ యత్నాళ్, ఎంపీ ఈరణ్ణ కడాడి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసేందుకు పంచమసాలి మఠాధిపతులు, నాయకులు గాంధీభవన్ నుంచి 'కృష్ణ' వరకు నడిచి వెళ్లారు.

విద్యార్థిని విషాదాంతం



విద్యార్థిని ప్రేమ

చిత్రదుర్గం: చిత్రదుర్గంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ప్రేమ (19) అనే విద్యార్థిని శుక్రవారం కళాశాల నాలుగంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సంబంధిత పోలీస్ అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఆమె తోటి విద్యార్థులతో కలిసి ఉదయమే కళాశాలకు చేరుకుంది. కాసేపు తరగతి గదిలో కూర్చున్నా.. ఒక్కసారిగా భవనం పైకి చేరుకుని.. అక్కడి నుంచి దూకేసింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే బసవేశ్వర వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించినా.. చివరికి కన్నుమూయడంతో విషాదం నెలకొంది. ఓ యువకుడు ఆమెను నిత్యం సతాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దర్యాప్తు అధికారులు వివరించారు.

మద్యం తాగించి.. బాలికలకు నరకం చూపారు

రామనగర, న్యూస్‌టుడే : కనకపురలోని ఒక కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులతో బలవంతంగా మద్యం తాగించి ముగ్గురు లెక్చరర్లు వేధించారనే సమాచారం కలకలం రేపుతోంది. ఒక గదిలో వారిని ఉంచి తమతో కలిసి నృత్యాలు చేయాలని ఒత్తిడి చేశారని సమాచారం. ఈ వివరాల్లోకి వెళితే.. అక్టోబరు ఐదు నుంచి పది వరకు కళాశాల నుంచి విద్యార్థులను మడికేరి పర్యటనకు తీసుకువెళ్లారు. అక్టోబరు తొమ్మిది రాత్రి విద్యార్థినులను తమ గదికి పిలిపించుకుని వారితో మద్యం తాగాలని ఒత్తిడి చేశారు. మద్యం తాగిన అనంతరం నృత్యం చేయాలని బలవంతం చేశారు. బాధిత విద్యార్థినులు తరువాత మేల్కొని.. సమస్యను కుటుంబ సభ్యులకు ఆలస్యంగా వివరించారు. బాధితుల ఫిర్యాదుతో కనకపుర ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కళాశాల లెక్చరర్లు విశ్వనాథ్, లక్ష్మీశ్, నాగేశ్‌లపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల రక్షణ కమిషన్ సంబంధిత కళాశాల యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల వేళ..

ఏడాదిన్నర కాంగ్రెస్ సర్కారును కుదురుగా ఉండనీయని వివాదాస్పద అంశాల్లో ముడా ఒకటి. వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి కేసు నుంచి నెమ్మదిగా బయటపడే ప్రయత్నం చేసిన అధికార పక్షానికి ముడా కేసు ఎంతకీ తెగని సమస్యగా మారింది. విపక్షాలు అదే పనిగా ఆరోపణలు చేస్తూ.. ఏకంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా కోసం పట్టుబడుతుండగా.. ఈ అక్రమాల దర్యాప్తు పారదర్శకంగా కొనసాగాలంటే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న లోకాయుక్త, సిట్‌ల ద్వారా సాధ్యపడదని అభిప్రాయపడుతున్నాయి. రూ.వేలకోట్ల విలువైన అక్రమాలు బయటపడాలంటే ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థల దర్యాప్తుతోనే సాధ్యమని విపక్ష నేత ఆర్.అశోక్‌తో పాటు కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామి, విధానపరిషత్తులో విపక్ష నేత చలవాది నారాయణస్వామి తదితరులు నిత్యం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేస్తూనే ఉన్నారు. సెప్టెంబరు 27న లోకాయుక్త, 30న ఈడీ సంస్థ ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఈ అక్రమాల్లో సంబంధం ఉందని భావిస్తున్న మరో ఐదుగురిపై కేసులు నమోదు చేశాయి. అప్పటి నుంచి అక్టోబరు తొలివారం వరకు ముడా పంపిణీ చేసిన వివాదాస్పద స్థలాలలో ఫిర్యాదుదారుల మహజరు ప్రక్రియ లోకాయుక్త పోలీసులు నిర్వహించారు. వెనువెంటనే ఈడీ అధికారులు ఫిర్యాదుదారు స్నేహమయి కృష్ణతో పాటు పలువురు ముడా అధికారులను విచారించారు. శుక్రవారం ఈ కేసుకు సంబంధించిన అధికారులు పనిచేసే 20కిపైగా కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. సరిగ్గా ఎన్నికల ప్రక్రియ ఊపందుకునే సమయంలో ఈడీ రాజకీయాల్లో అలజడి సృష్టించింది.

ఈడీ.. రాజకీయ అలజడి



లోపల ఈడీ సోదాలు.. బయట కేంద్ర బలగాల భద్రత

ఈనాడు, బెంగళూరు : రాష్ట్రంలో మూడు విధానసభ నియోజకవర్గాల ఉప ఎన్నికలకు సరిగ్గా నెల సమయం కూడా లేదు. ఓ వైపు పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు చేస్తుండగా.. శుక్రవారం ఒక్కసారిగా అలజడి రేగింది. మూడు నెలలుగా రాష్ట్ర రాజకీయాలపై తీవ్రంగా ప్రభావం చూపిన మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) కేసులు శుక్రవారం మరో మలుపు తిరిగాయి. గత సెప్టెంబరు 30న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిశ్శబ్దంగా విచారణ ప్రక్రియను కొనసాగించింది. శుక్రవారం ఉన్నపళంగా ముడా కార్యాలయం, ఆ సంస్థ అధికారుల నివాసాలపై మెరుపు దాడి చేసింది. ఇప్పటికే లోకాయుక్త, సిట్ అధికారులు దర్యాప్తు ప్రక్రియను కొనసాగిస్తుండగా.. కాస్త నెమ్మదిగా ఉన్న అధికార పక్షానికి శుక్రవారం నాటి ఈడీ దాడులు దడ పుట్టించాయి.

వారికే నష్టం

మూడు క్షేత్రాల ఎన్నికల ప్రచారంలో కీలక అస్త్రంగా మారిన 'ముడా' కేసు ఎక్కువగా నష్టపరిచేది అధికార పక్షానికే. ఆ కేసులో వాస్తవాంశాలు ఎలా ఉన్నా రాజకీయ ప్రచారంలో ఇదే అంశం విపక్షాలకు ఓ ఆయుధంగా మారనుంది. ఇప్పటికే ఓ మంత్రిని జైలుపాలు చేసిన 'వాల్మీకి కార్పొరేషన్'కేసు సైతం ఈ ప్రచారంలో మరో అస్త్రంగా మారనుంది. ఈ రెండు అంశాలు అధికార పక్షానికి పెద్ద తలనొప్పిగా మారనున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రి స్థాయి నేతపై కేసు నమోదు కావటంతో విపక్షాలు సహజంగానే ఆయన రాజీనామా డిమాండ్ చేస్తున్నాయి. రాజీనామా కోరుతున్న విపక్షాలు ముందుగా అక్రమ మైనింగ్ కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్ర మంత్రి కుమారస్వామి, పోక్సో కేసుతో పాటు డినోటిఫికేషన్ అక్రమాల్లో కేసు నమోదైన యడియూరప్ప, గోద్రా సంఘటనలో ప్రధాని నరేంద్ర మోదీ తదితరుల నుంచి రాజీనామా కోరాలని ముఖ్యమంత్రి సిద్ధు డిమాండు చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థలు రాజకీయ ప్రభావంతో విధులు నిర్వహించరాదని ఆయన గురువారమే హితవుపలికారు. శుక్రవారం ఈడీ దాడులపై మాట్లాడుతూ ఇక వారి రాకపై నేను ఎలా స్పందించాలని సిద్ధు ప్రశ్నించారు. ఈడీ కేసులెలా ఉన్నా చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఈడీకి అవసరమైన దస్త్రాలు, సమాచారాన్ని అధికారులు ఇస్తారని వెల్లడించారు. విచారణలో ఇది సహజమైన ప్రక్రియని, దాడులు అని చెప్పాల్సిన పనిలేదని సూచించారు. కేవలం అధికారుల వరకే ఈడీ విచారణ పరిమితమైతే అధికార పక్షానికి నష్టం తగ్గినట్లే. ముఖ్యమంత్రి, ఆయన బంధువుల్లో ఎవరినైనా విచారణ కోసం అరెస్ట్ చేస్తే అధికార పక్షానికి ఎన్నికల సమయంలో గట్టి దెబ్బ తగిలినట్లే. శుక్రవారం మైసూరు, బెంగళూరుల్లో 20చోట్ల తనిఖీలు చేపట్టిన ఈడీ అధికారులు ఈ ప్రక్రియకు పారా సైనికుల భద్రత తీసుకోవటం, ముడా అధికారులను 40కిపైగా ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. వీరిచ్చే వివరణ ఆధారంగా తదుపరి విచారణ ప్రక్రియను కొనసాగిస్తారు.



సిద్ధరామయ్యకు సంకటమే



విలేకరులతో మాట్లాడుతున్న ఈడీ అధికారి

వేడెక్కిన మైసూరు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో ఇళ్ల స్థలాల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఫిర్యాదులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు స్పందించారు. ముడా కార్యాలయం, ఇళ్ల స్థలాల కేటాయింపులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవరాజు (ఏ4) నివాసంపై 12 మంది అధికారులు దాడులు చేసి, సోదాలు చేసుకుని, కొన్ని దస్త్రాలను తీసుకెళ్లారు. ముడాలో అక్రమాలు జరిగాయని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇప్పటికే ఫిర్యాదు చేశారు. భద్రత కోసం పోలీసులు, 20కు పైగా సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. కార్యాలయ ప్రహరీ వద్ద ఉన్న గేటుకు తాళం వేసి, ప్రజలు అక్కడకు రాకుండా అడ్డుకున్నారు. తాము కోరిన దాఖలాలు ఇవ్వాలని ఈడీ ఇప్పటికే మూడు నోటీసులు, ఒకసారి సమన్లు జారీ చేసినా అధికారులు బదులివ్వకపోవడంతో వారే కార్యాలయానికి చేరుకున్నారు. అక్రమాలకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవరాజుకు బెంగళూరు శివారు ప్రాంతం కెంగేరిలోని నివాసం, మైసూరు తహసీల్దారు కార్యాలయంపైనా దాడి చేసి సోదాలు నిర్వహించారు. ఈడీ అధికారులకు తాము పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని ముడా కార్యదర్శి ప్రసన్న తెలిపారు. నకలు ప్రతులు వద్దని, ఒరిజినల్ పత్రాలు ఇవ్వాలని ఈడీ అధికారులు కోరారని చెప్పారు. శనివారం మరోసారి సోదాలు చేస్తామని అధికారులు తమకు చెప్పారని తెలిపారు.



ముడా కార్యాలయ నడవాలో పేర్చిన దస్త్రాలు

రాజకీయ ప్రేరితం కాదు

ముడా కార్యాలయంపై ఈడీ దాడి రాజకీయ ప్రేరితం కాదని విపక్ష నేత ఆర్.అశోక్ బెంగళూరులో వ్యాఖ్యానించారు. ముడా అక్రమాలపై స్నేహమయి కృష్ణ ఇప్పటికే గవర్నర్, లోకాయుక్త, ఈడీ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఏ1గా, ఆయన భార్య పార్వతి ఏ2గా ఉన్న కేసుకు సంబంధించి, దర్యాప్తులో భాగంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు.

ఎన్నికల నేపథ్యం..

ఉప ఎన్నికల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలతో కేంద్రం దాడులు చేయిస్తున్నట్లు కేపీసీసీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఇబ్బంది పెట్టేందుకే దాడులు జరిగాయన్నారు. ఇప్పటికే లోకాయుక్త దర్యాప్తు చేస్తున్న కేసులో ఈడీ జోక్యం ఎందుకని ప్రశ్నించారు. నగదు లావాదేవీల ఆరోపణలే లేనప్పుడు ఈడీ దాడి చేయడం సరి కాదని మైసూరులో విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు.

ప్రహ్లాద్ జోషి సోదరునిపై కేసు

బెంగళూరు, (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ ఇప్పిస్తానని రూ.2 కోట్లు తీసుకుని వంచనలకు పాల్పడిన ఆరోపణలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి సోదరుడు గోపాల్ జోషిపై కేసు నమోదైంది. ఆయనతో పాటు జోషి చెల్లెలు విజయలక్ష్మి, ఆమె కుమారుడు అజయ్ జోషిలపైనా బసవేశ్వరనగర ఠాణా పోలీసులు కేసులు నమోదు చేసుకున్నారు. నాగఠాణా నియోజకవర్గం నుంచి జనతాదళ్ అభ్యర్థిగా దేవానంద చౌహాన్ 2018లో పోటీ చేసి గెలుపొందారు. 2023 ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి భాజపా నుంచి టికెట్ ఇప్పిస్తానని చౌహాన్‌ను నమ్మించారనేది అభియోగం. రూ.5 కోట్లు ఇస్తే టికెట్ వచ్చేలా చేస్తామన్నారు. తన వద్ద రూ.2 కోట్లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో.. ఆ మొత్తాన్ని బయానాగా తీసుకున్నారు. టికెట్ ఇవ్వడం సాధ్యం కాలేదని చివరి క్షణంలో చెప్పారు. తమకు రూ.200 కోట్ల విలువైన ప్రాజెక్టు వస్తుందని, అందులో వాటా ఇస్తామని లేదా నగదు తిరిగి ఇస్తామని నమ్మించారు. రోజులు గడుస్తున్నా వారి నుంచి స్పందన రాకపోవడంతో నగదు తిరిగి ఇవ్వాలని బాధితుడు కోరారు. ఇప్పుడు తనను, భార్య సునీతను కులం పేరిట దూషిస్తున్నారని, ప్రాణహాని తలపెడతామని బెదిరిస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో దేవానంద్ ఆరోపించారు.



ప్రహ్లాద జోషికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

జోషిని బర్తరఫ్ చేయండి..

బెంగళూరు (శివాజీనగర): కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ కేపీసీసీ ప్రతినిధులు శుక్రవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. లోక్‌సభకు భాజపా నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామని మాజీ ఎమ్మెల్యే చౌహాన్‌ను ఆయన సోదరుడు, సోదరి, మేనల్లుడు వంచించారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ ఆరోపించారు. జోషి నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయకపోతే.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను వెనుక నుంచి తప్పులు చేయిస్తూ.. కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు జోషి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతినిధులు పుట్టరాజు, ఉమేశ్, హేమరాజు, కుశాల్, హరువూగౌడ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

శీతాకాల సభాపర్వానికి వేళాయె



బెళగావి సువర్ణసౌధలో సమావేశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఉభయ సభాపతులు బసవరాజ హొరట్టి, యూటీ ఖాదర్ తదితరులు

ఈనాడు, బెంగళూరు : విధానసభ శీతాకాల సమావేశాలకు వేళయ్యింది. వచ్చే నెల నుంచి ఉప ఎన్నికలతో పాటు రాజకీయ, సామాజిక, భాషాపరమైన కీలక అంశాలపై చర్చలు నిర్వహించాల్సి ఉండటంతో ఈ సమావేశాల తేదీలను తేల్చటం సవాలుగా మారింది. ఉత్తర కర్ణాటక సమస్యాత్మక అంశాలే కాక పాలనాపరమైన బిల్లులు, చర్చల కోసం బెళగావిలోనే సమావేశాలు నిర్వహించాలి. నిర్వహణ తేదీలే సర్కారుకు సవాలుగా మారాయి. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉన్నా తమ వంతు బాధ్యతగా ఉభయ సభల స్పీకర్లు యు.టి.ఖాదర్, బసవరాజ హొరట్టి తదితరులు శుక్రవారం బెళగావిలోని సువర్ణసౌధను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై సమావేశాల నిర్వహణపై చర్చించారు. ఇదే సందర్భంగా సమావేశాల నిర్వహణ తేదీలను చూచాయిగా ప్రకటించారు.

- డిసెంబరు 9 నుంచి 20 వరకు శీతాకాల సమావేశాలను బెళగావిలో నిర్వహించాలని నిర్ణయించినా ఆ తేదీలను అధికారికంగా ముఖ్యమంత్రి ప్రకటిస్తారని విధానసభ స్పీకర్ యు.టి.ఖాదర్ వెల్లడించారు. గత సమావేశాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చించేందుకు నాలుగు రోజుల సమయాన్ని కేటాయిస్తామన్నారు. ఇదే నేపథ్యంలో.. బెళగావిలో మహాత్మాగాంధీ నేతృత్వంలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ 39వ సమ్మేళనానికి వందేళ్లు నిండిన సందర్భం, కిత్తూరు రాణి చెన్నమ్మ విజయోత్సవానికి 200 ఏళ్లు దాటిన ఘనతపై ప్రత్యేక చర్చకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ రెండు సంఘటనలపై ప్రత్యేక ఛాయాచిత్ర ప్రదర్శన, సువర్ణసౌధ వద్ద మహాత్మాగాంధీ విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామన్నారు. ఎప్పటిలాగానే సమస్యల పరిష్కారాల కోసం శాంతియుత ఆందోళనలకు అవకాశం కల్పిస్తామని వివరించారు. సభాపతుల వెంట జిల్లా పాలనాధికారి మహ్మద్ రోషన్, డీసీపీ రోహన్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.
- నవంబరు 13న మూడు విధానసభ క్షేత్రాలకు ఎన్నికలు, 23న ఫలితాలు, డిసెంబరు 20 నుంచి 23 వరకు మండ్యలో కన్నడ సాహిత్య సమ్మేళనం, డిసెంబరు 26, 27 తేదీల్లో బెళగావిలో వందేళ్ల బెళగావి కాంగ్రెస్ సమ్మేళనానికి గుర్తుగా సమావేశాలు, 25న బెళగావిలో కిత్తూరు విజయోత్సవ సమావేశం.. ఇలా వరుస కార్యక్రమాలుండటంతో బెళగావిలో శీతాకాల సమావేశాల నిర్వహణ తేదీలను నిర్ణయించటం సవాలుగా మారినా.. త్వరలో వివరాలు వెల్లడికానున్నాయి.

విద్యాలయాలకు నిధులేవీ?



ధర్నాలో పాల్గొన్న ఉద్యోగ సమాఖ్య సభ్యులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కర్ణాటకలో 1995 అనంతరం ప్రారంభమైన అనుదానరహిత కన్నడ మాధ్యమ పాఠశాలలు, కళాశాలలకు నిధులు విడుదల చేయాలని ఆ విద్యాసంస్థల పాలక మండలి, ఉద్యోగులు, సిబ్బంది సమాఖ్య డిమాండ్ చేసింది. కన్నడ మాధ్యమ పాఠశాలలను కాపాడేందుకు, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు విడుదల చేస్తామని గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బెంగళూరు ఫ్రీడంపార్కులో సమాఖ్య సభ్యులు శుక్రవారం ధర్నాకు దిగారు. గ్రామీణ, తాలూకా ప్రాంతాల విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలకు చాలా కొరత ఉందని సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. నామమాత్రపు ఫీజులతో విద్యాసంస్థలను నిర్వహించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు.

నామినేషన్ల ఘట్టం షురూ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలోని మూడు విధానసభ నియోజకవర్గాలకు నవంబరు 13న ఉప ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రారంభించారు. చెన్నపట్టణ, శిగ్గావి, సండూరులో నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మూడు ప్రధానపార్టీలు- కాంగ్రెస్, జేడీఎస్, భాజపా అభ్యర్థులను ఇంకా ఖరారు చేయలేదు. నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25తో ముగుస్తుంది. 28న వాటి పరిశీలన, 30న ఉపసంహరణ క్రతువులు కొనసాగుతాయి. నవంబరు 13న పోలింగు చేపట్టి.. 23న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు.

హంతకులకు సత్కారాలా?



ఆచార్య కలబురగి చిత్రపటంతో ధర్నా చేస్తున్న సమితి ప్రతినిధులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఆచార్య ఎంఎం కలబురగి, సీనియరు విలేకరి విలేకరి గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన నిందితులు బెయిలుపై విడుదలైతే ఆర్‌ఎస్ఎస్, హిందూ సంఘాల ప్రతినిధులు వారిని సత్కరించారని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయపురలో వారిని ఈ నెల 12న సత్కరించారని ఆందోళన వ్యక్తం చేశారు. హంతకులను సత్కరించడం వారి సంస్కృతిని తెలియజేస్తుందన్నారు. ఆ సంస్థల ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వీరశైవ లింగాయత సమన్వయ వేదిక శుక్రవారం బెంగళూరులో నిర్వహించిన ధర్నాకు ఆయన నేతృత్వం వహించి మాట్లాడారు. బసవణ్ణ వచనాలను వక్రీకరించి 'వచన దర్శన' పేరిట సంఘ పరివార ఒక పుస్తకాన్ని ప్రచురించి, పంపిణీ చేస్తోందని ఆరోపించారు. పుస్తక ప్రచురణకర్తలపై కేసు పెట్టి, న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. అనుమతి లేకుండా ధర్నా చేయడంతో పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

దర్శకుడు దీపక్ మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : నటి అమూల్య సోదరుడు, దర్శకుడు దీపక్ అరస్ (46) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. మనసాలజీ, షుగర్ ఫ్యాక్టరీ సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా ఆయన కోమాలో ఉన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు.

అసోం వాసి ఆత్మహత్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆనేకల్ సమీపంలోని ఇండ్లవాడి క్రాస్‌లో ఉంటున్న ఇబ్రాజ్ గురుంగ (49) అనే వ్యక్తి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అసోంకు చెందిన తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఉంటున్న అతను ఫ్యూచర్ కిచెన్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనేకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



పతకం, ట్రోఫీ, చెక్కు ప్రదర్శిస్తున్న కృతార్థ్

వాయుసేన పోటీల్లో ఘన సాధన

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : జాతీయ ఏరో క్వెస్ట్ పోటీల్లో పీఈఎస్ ఇంజినీరింగ్ ఐదో సెమిస్టర్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విద్యార్థి ఎంసీ కృతార్థ్ మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. భారతీయ వాయుసేన సైబర్ ఏరో క్వెస్ట్-2024 పేరిట నిర్వహించిన పోటీల్లో రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండో దశకు 15 మంది చేరుకున్నారు. తుది దశలో విజేతగా నిలిచి పతకాలు, ట్రోఫీ, రూ.75 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. కృతార్థ్‌ను విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఆచార్య ఎం.ఆర్.దొరెస్వామి అభినందించారు.

అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: కర్ణాటకలోని చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి చెందిన రావూరి శ్రీనివాసులు నాయుడుపై గతంలో అక్రమ ఆస్తుల కేసు నమోదైంది. ఆ కేసును ఆ రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. అందులో భాగంగానే శుక్రవారం సీబీఐ అధికారులు తిరుపతి జిల్లాలోని చంద్రగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ కాపీలను తీసుకున్నారు. తిరుపతి కలెక్టరేట్ పరిధిలో లేఅవుట్లు ఏమైనా వేశారా? అని పరిశీలించారు.

సిబ్బందిపై ఖైదీల రాళ్ల దాడి

కలబురగి: కలబురగి కారాగారంలోని కొందరు ఖైదీలు అక్కడి సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. దాడిలో శ్రీశైల్ అనే ఉద్యోగి గాయపడ్డారు. సాగర్ బ్యాడర్, అర్జున్, నాగరాజ, మహంతేశ్, సునీల, జమీర్, జుల్ఫికర్, షేక్ సద్దాం, జాకీర్, లతీఫ్, అబ్దుల్ ఖాదర్, జిలాని అందరూ కలిసి ఓంకార స్వామి అనే ఖైదీపై దాడికి ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కారాగార సిబ్బందిపై నిందితులు రాళ్లదాడికి దిగారు. పరిస్థితి అదుపుతప్పుతున్నట్లు గుర్తించి, ఎక్కువ మంది సిబ్బంది వెళ్లి వారిని నియంత్రించి వేర్వేరు బారక్‌లకు తరలించారు. వారిపై కొత్త కేసు నమోదు చేశారు. బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

అశాంతి సృష్టించాలనే బాంబు బెదిరింపులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కళాశాలల్లో బాంబులు పెట్టామని, త్వరలో వాటిని పేల్చివేస్తామంటూ ఇ-మెయిల్ పంపి బెదిరింపులకు పాల్పడిన దీపాంజల్ మిశ్ర అనే వ్యక్తిని బెంగళూరు వీవీపురం పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిందితుడు బీకాం పట్టభద్రుడు. డార్జిలింగ్ నివాసి. నగరంలో అశాంతిని సృష్టించాలని బీటీఐ కళాశాలకు ఈ నెల 10న ఇ-మెయిల్ పంపించాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు డార్జిలింగ్ సమీపంలోని సాల్‌బరి పట్టణానికి వెళ్లి నిందితుడ్ని అరెస్టు చేసి తీసుకువచ్చారని నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. ఈ తరహా బెదిరింపులను పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఆధునిక సాంకేతికత సహకరిస్తుందన్నారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఈ తరహా నేరాలను అడ్డుకోవచ్చని తెలిపారు.

టికెట్లన్నీ ఒకే కుటుంబానికేనా?

మంత్రి సంతోష్ ఎస్.లాడ్‌కు తలనొప్పులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ఇ.తుకారామ్ రాజీనామాతో ఖాళీ అయిన సండూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు అభ్యర్థి ఎంపిక వ్యవహారం కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా రాజ్యాంగం, రిజర్వేషన్ సామాజిక న్యాయం అనే చర్చ తెరపైకి వచ్చింది. రాజ్యాంగం మనకు సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, సమాన వాటా, అందరికీ సమానత్వాన్ని అందిస్తుంది. గిరిజన తెగలకు (ఎస్టీ) కేటాయించిన నియోజకవర్గాన్ని ఇన్నాళ్లూ ఎంపీ సండూరు తుకారామ్‌కు అంకితం చేశారు. ఇప్పుడు అతని కుటుంబానికి రిజర్వేషన్లు లభిస్తున్నాయి. ఎస్టీ సముదాయానికి చెందిన పలువురు ఉన్నా..తుకారామ్ కుటుంబానికి టికెట్ ఇవ్వకూడదని పలువురు బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ తలుపులు తట్టారు. చివరికి మంత్రి దాదా (సంతోష్ ఎస్.లాడ్) వద్దకు పంచాయితీ చేరింది. ఎంపీ తుకారామ్ కుటుంబానికి టికెట్ ఇవ్వకండని పలువురు నియోజకవర్గం ఎస్టీ సముదాయానికి చెందిన నేతలు మంత్రి సంతోష్ ఎస్.లాడ్‌ను కోరుతున్నారు.



బెంగళూరులో నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సంతోష్ ఎస్.లాడ్

కాంగ్రెస్‌కు కంచుకోట సండూరు

బళ్లారి జిల్లాలో సండూరు అసెంబ్లీ నియోజకవర్గం మాత్రం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారింది. 2004లో సండూరు నియోజకవర్గం నుంచి జేడీఎస్ నుంచి పోటీ చేసిన సంతోష్ ఎస్.లాడ్ గెలుపొంది రికార్డ్ సృష్టించారు. అనంతరం 2008లో ఎస్టీకి రిజర్వు కావడంతో సంతోష్ ఎస్.లాడ్ రాజకీయ కురువృద్ధుడు, ఎం.పి.ప్రకాష్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో సిద్ధరామయ్యకు అత్యంత ఆప్తుడిగా మారారు. అనంతరం 2008 విధానసభ ఎన్నికల్లో ధార్వాడ జిల్లా కలఘటగి నియోజకవర్గానికి మారారు. కలఘటగి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా సంతోష్ ఎస్.లాడ్ గెలుపొందినా నేటికీ సండూరు నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపిక చేయడంలో, గెలుపుబాటలో వెళ్లడానికి కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రకృతి సంపదకు నిలయం

జిల్లాలో సండూరు తాలూకా ప్రకృతి సంపదకు నిలయం.. రాష్ట్రంలోనే సంపన్న నియోజకవర్గమని చెప్పవచ్చు. సంతోష్ ఎస్.లాడ్ గనుల తవ్వకం చేపట్టడం, అపారమైన ఖనిజ సంపద ఉన్న క్షేత్రాన్ని మరొకరికి వదులుకోవడం ఇష్టం లేదు. తాలూకాలో కాంగ్రెస్ పార్టీపై మంచి పట్టు సాధించారు. తన సోదరుడైన వీఎస్.లాడ్ వద్ద అకౌంటెంట్‌గా పనిచేస్తున్న తుకారామ్‌ను 2008 విధానసభ ఎన్నికల్లో పోటీలో నిలిపారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకరి సారి ఎంపీగా గెలుపొందిన ఇ.తుకారామ్ మాత్రం సమయం దొరికినప్పుడు కార్యాలయాలకు వెళ్లి లెక్కలు చూసుకుంటారు. ఆయన విజయంలో సంతోష్ ఎస్.లాడ్ కీలకంగా వ్యవహరించారు. అవసరానికి రాజకీయాల్లోకి వచ్చిన తుకారామ్ ఉప ఎన్నికల్లో తన కుటుంబానికి టికెట్ ఇవ్వాలని ప్రయత్నాలు చేయడాన్ని నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు.

తుకారామ్ పార్టీని బలహీనపరిచారు

సంతోష్ ఎస్.లాడ్ అండతోనే తుకారామ్ నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఎంపీగా విజయం సాధించారు. ప్రస్తుతం ఎంపీగా ఉంటున్నారు. ఉప ఎన్నికల్లోనూ తన కుటుంబానికి టికెట్ ఇస్తే అదే వర్గానికి చెందిన పలువురికి అన్యాయం జరుగుతుందని నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారు మంత్రి సంతోష్ ఎస్.లాడ్‌ను ప్రశ్నిస్తున్నారు. తన కుటుంబానికి మరోసారి టికెట్ ఇవ్వాలని కోరడం సరికాదు. గిరిజన వర్గాల ప్రజలు రాజకీయంగా ముందుకు రావాలని ఎస్టీకి రిజర్వేషన్ కల్పించారు. లాడ్ మరోసారి తుకారామ్ కుటుంబ సభ్యులను అభ్యర్థిగా ప్రకటిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని తుమటి లక్ష్మణ్ తన మనసులో మాట చెప్పారు. తాము రాజకీయంలో ఉన్నప్పుడు తుకారామ్ రాజకీయం చూడలేదు. ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం మార్చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలయ్యే పరిస్థితికి తీసుకొచ్చారని నిష్ఠూరమాడారు. ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకం..ఆలోచించి టికెట్ ఇవ్వాలని కోరారు. మంత్రి సంతోష్ ఎస్.లాడ్ మాట్లాడుతూ తుకారామ్ తరఫున నేను మాట్లాడటం లేదు. అభ్యర్థి నేటి వరకు ప్రకటించలేదు. సుమారు 400 మందికిపైగా బెంగళూరుకు వచ్చారు. ముఖ్యనేతలు ఉంటూ..మిగిలిన వారు నియోజకవర్గానికి వెళ్లండి..పార్టీ అధిష్ఠానంతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకుందామని చెప్పారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక మంత్రికి తలనొప్పిగా మారింది.

విమానాశ్రయం వాకిట వాణిజ్య వైభవం!



వర్తక వ్యవహారాలకు ప్రత్యేకించిన భవంతుల ఊహా చిత్రం ఇదిగో..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో బిజినెస్ పార్కు నిర్మాణాన్ని చేపడుతున్నామని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ ప్రకటించింది. బిజినెస్ పార్కు నిర్మాణానికి ఇప్పటికే 17.7 ఎకరాల భూమిని సంస్థ గుర్తించింది. గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌గా దీన్ని అభివృద్ధి చేయడం ద్వారా 3.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు, ఏటా రూ.50 వేల కోట్ల డాలర్ల లావాదేవీలకు అవకాశం కలుగుతుందని బీఏసీఎల్ సీఈఓ రావు మునుకుట్ల తెలిపారు. విమానాశ్రయం పరిధిలోనే నాలుగు బ్లాకుల్లో తలెత్తనున్న ఈ పార్కు దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు వేగంగా వచ్చి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ వ్యాపార, ఉద్యానాలు, విద్య, ఆరోగ్య కేంద్రాలు, పరిశోధన, అభివృద్ధి, మనోరంజన, ఆతిథ్యయ కేంద్రాలు ఈ బిజినెస్ పార్కుకు అనుబంధంగా ఉంటాయని వివరించారు. గత ఏడాది ఈ విమానాశ్రయం నుంచి 37.5 మిలియన్ల మంది ప్రయాణించగా, 2030 నాటికి ఈ సంఖ్య 90 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశామన్నారు. బిజినెస్ పార్కు ఏర్పాటుతోనూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని ఆయన వివరించారు.

ముంపు ముప్పు తప్పించే చర్యలు షురూ



జక్కసంద్ర రాజకాలువలో పూడిక తొలగింపు పనులు



తొలగించిన పూడికను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర పరిధి రాజకాలువల్లో పూడిక తొలగించే పనులు వేగమందుకున్నాయి. బెంగళూరు లోతట్టు ప్రదేశాలు ముంపునకు గురి కాకుండా అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న పనులపై తాజాగా సమీక్షించి పలు సూచనలు చేశారు. కాలువల్లో పూడిక పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించడంతో ఆ దిశగా అడుగు ముందుకేశారు. ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రదేశాల్లోని రాజకాలువల్లో పూడిక తొలగించే పనులను త్వరగా చేపట్టారు. వర్షాల కారణంగా ముంపునకు గురికాకూడదనే ఉద్దేశంతో అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. రాజకాలువలతో పాటు రహదారి పక్కన ఉన్న వాననీటి కాలువల్లో నీరు సాఫీగా ప్రవహించడానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. లోతట్టు ప్రాంతంలో కీలకమైన అగర సమీప జక్కసంద్ర రాజకాలువ శుభ్రం చేయడానికి ఐదు జేసీబీ యంత్రాలు ఉపయోగిస్తున్నారు. అక్కడ పూడిక తొలగించకపోతే అగర, హెచ్.ఎస్.ఆర్ లేఔట్, కోరమంగల బిడ్ ప్రదేశాలు ముంపుపాలవుతాయి. ఇప్పటికే వారం రోజులుగా వానలు కొనసాగుతున్నాయి. అనేక కాలువలు పొంగి ముంపు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. కోరమంగల, మడివాళ, బెళ్లందూరు, మారతహళ్లి, సర్జాపురలో సమస్య తీవ్రంగానే ఉంది. సుమారు 650 కిలోమీటర్ల పొడవున్న నాలుగు రాజకాలువల్లో ఇప్పటి వరకు 350 కిలోమీటర్ల పరిధి వరకు శుభ్రం చేశారు. మెజిస్టిక్ నుంచి బెళ్లందూరు వరకు కోరమంగల రాజకాలువ చిన్నవానకూ సమస్య తెచ్చిపెడుతోంది. దీని పరిధిలో ముంపు ప్రాంతాలు ఎక్కువ కావడంతో అన్నివేళలా పాలికె అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.



రహదారిపై నీరు ఆగకుండా.. కాలువల్లోకి మళ్లించడానికి రంధ్రాల ఏర్పాటు

పత్తి రైతుల గోడు ఆలకించరూ..

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని తాలూకాలు, ఫిర్కా ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను స్థాపించాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాన్ని తెరవాలని కోరుతూ 'అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల జిల్లా సంఘటన' శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద బైఠాయించింది. కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సంఘటన ప్రతినిధులు, రైతులు నినాదాలు చేశారు. అనంతరం సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ రూ.5500 నుంచి రూ.7500 పలుకుతోందని, ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా చేతికి రాదని తెలిపారు. అతివృష్టి వల్ల దిగుబడులు కోల్పోయిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ ఆరంభంలోనే ధర లేకపోతే ముగింపు సమయానికి ఇంకా పడిపోయే అవకాశముందని వివరించారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. క్వింటాల్‌కు రూ.10 వేలు ఖరారు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని విశ్లేషించారు. రాష్ట్రం ప్రోత్సాహధనం చెల్లించాలని, సూటు పేరిట కొంత పత్తిని తీసి వేయకుండా వ్యాపారులకు సూచించాలన్నారు. మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పాలనాధికారి ఏపీఎంసీ అధికారులు, రైతులు, పత్తి వ్యాపారులు, రైతు సంఘాలతో సమావేశం జరపాలని డిమాండ్ చేశారు.



సీసీఐ కార్యాలయం వద్ద బైఠాయించిన అన్నదాతలు

బంగ్లా పౌరుల నిర్బంధం

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ నగరంలో అక్రమంగా ఉంటున్న ఎనిమిది మంది బంగ్లా పౌరులను సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. మహ్మద్ మాణిక్, హకీం అలి, సుజోన్, ఇస్మాయిల్, కరీం, సలాం, రాజికుల్, ఉస్మాన్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహ్మద్ మాణిక్ మొదట దొరికిపోయాడు. ఆ వ్యక్తిని విచారించగా మిగిలిన వారి పేర్లు చెప్పాడు. నకిలీ ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులను వీరు చేయించుకున్నారు. భవన నిర్మాణ పనుల కోసం ఉస్మాన్ వీరిని అక్రమ మార్గంలో బంగ్లాదేశ్ నుంచి శివమొగ్గకు తీసుకువచ్చాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

శ్రీరామసేన నిరసన

గదగ, న్యూస్‌టుడే : లక్ష్మేశ్వర పట్టణంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గోసావి సముదాయానికి చెందిన యువకులపై పోలీసులు దాడి చేశారని శ్రీరామసేన ఆరోపించింది. గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో శ్రీరామసేన రాష్ట్ర కార్యదర్శి రాజు ఖానప్పనవర విలేకరులతో మాట్లాడారు. ఎస్సై ఈరణ్ణ రిత్తి, ఇతర సిబ్బంది లాఠీలతో యువకులను కొట్టి పంపించారని ఆరోపించారు. ఈరణ్ణ రిత్తిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చారు.

కలబురగి విభాగ స్థాయి హాకీలో సత్తా

రాష్ట్ర స్థాయికి ఎంపికైన బళ్లారి జట్లు



హాకీలో తలపడుతున్న బాలికలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా హాకీ స్టేడియంలో శుక్రవారం జరిగిన కలబురగి విభాగ స్థాయి హాకీలో బళ్లారి జట్లు సత్తా చాటాయి. బాల, బాలికల్లో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బళ్లారి జిల్లా హాకీ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన కలబురగి విభాగ స్థాయి క్రీడాపోటీలను క్రీడాశాఖాధికారి కొట్రేష్, హాకీ కోచ్ జాకీర్, క్రీడా ఉపాధ్యాయులు నాగన్న, రవికుమార్ ప్రారంభించారు.

బాలికల్లో విజేతలు

కలబురగి స్థాయి హాకీ పోటీలకు రాయచూరు, బళ్లారి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. మొదట అండర్-14 బాలికల విభాగంలో బళ్లారి (సెయింట్ ఫిలోమినా) - రాయచూరు (లయన్స్ పాఠశాల) పోటీ పడ్డాయి. జట్టు కెప్టెన్ తన్విశ్రీ నేతృత్వంలో రాయచూరుపై ఆధిపత్యం సాధించారు.(4-0) గోల్స్ చేసి బళ్లారి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో బళ్లారి - రాయచూరు జట్లు పోటీ పడ్డాయి. కెప్టెన్ నవ్య నేతృత్వంలో (6-0) గోల్స్‌తో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో..

అండర్-14 బాలుర విభాగంలో బళ్లారి, రాయచూరు, కలబురగి జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. మొదట జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఫైనల్‌కు బళ్లారి - కలబురగి చేరుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో (5-0)గోల్స్‌తో బళ్లారి జట్టు గెలుపొందింది. అండర్-17 బాలుర విభాగంలో బళ్లారి, రాయచూరు, కలబురగి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. లీడ్ మ్యాచ్‌లో రాయచూరు ఫైనల్‌కు దూరమైంది. ఫైనల్స్‌లో బళ్లారి - కలబురగి జట్లు పోటీ పడ్డాయి. బళ్లారి జట్టు (10-0) గోల్స్‌లో గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. గెలుపొందిన జట్లుకు క్రీడా శాఖాధికారి కొట్రేష్, హాకీ కోచ్ నాగరాజు, రవికుమార్, జాకీర్ అందజేసి అభినందించారు. ప్రముఖులు శివానంద, శేక్షావలి, రాజు తదితరులు పాల్గొన్నారు.



అండర్-14 బాలుర విభాగంలో గెలుపొందిన వారు



అండర్-14 బాలికల విభాగంలో విజేతలు



అండర్-17 బాలికల విభాగంలో..



అండర్-17 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన జట్టు

భూమికి పున్నమి పూజలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మల్నాడు, ధార్వాడ తదితర ప్రాంతాల రైతు కుటుంబాల సభ్యులు గురు, శుక్రవారాల్లో భూమికి పున్నమి పూజలు నిర్వహించారు. దసరా అనంతరం వచ్చే పౌర్ణమి రోజు పొలాలకు వెళ్లి చేసుకునే పూజలను భూమి హుణ్ణిమ, శేగి హుణ్ణిమ అని వ్యవహరిస్తారు. విజయదశమి రోజూ ఈ పూజకు కావలసిన బుట్టలను సిద్ధం చేసుకుంటారు. ఆ బుట్టలను మట్టితో అలుక్కుంటారు. ఏడు రకాల వేపుళ్లు, అడవిలో దొరికే 101 రకాల ఆకులు, ఆకుకూరలు, కీరదోస ఉపయోగించి చేసే కుడుములు తదితరాలను ఆ బుట్టల్లో ఉంచుకుని, కుటుంబ సభ్యులందరూ తమ పొలానికి వెళతారు. తోటలో ఉన్న చెట్లకు, నాట్లు వేయబోయే పొలాల్లో పూజ చేసుకుంటారు. కొంత ఆహారాన్ని పొలం చుట్టూ చల్లుకుంటారు. కుటుంబ సభ్యులందరూ అక్కడే భోజనం చేసి, రాత్రి సమయానికి ఇళ్లకు తిరిగి వస్తారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా పలు గ్రామాల్లో ఈ భూమి హుణ్ణిమను ఆచరిస్తుంటారు.



పొలంలో మొక్కకు పూజ చేస్తున్న కుటుంబ పెద్ద

వాసవీ శాంతిధాంలో పంచామృతాభిషేకాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలో వెలసిన వాసవీశాంతిధాం శుక్రవారం కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. గోమాత పూజ, మరకత వాసవీ కన్యకా పరమేశ్వరికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, వాసవీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం భాజపా ఎమ్మెల్సీ డి.ఎస్. అరుణ్, ప్రతిభ దంపతులు పాల్గొన్నారు. పలువురు భక్తులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ(షిమోగా)లో వాసవీ అమ్మవారిని ప్రతిష్ఠాపన చేసి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 ఫిబ్రవరి నెలలో వంద సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించాలని అమ్మవారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నామని వివరించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డి.ఎస్. అరుణ్, ప్రతిభ దంపతులు

డీసీఎం డ్రైవర్ అనుమానాస్పద మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన తెలంగాణలోని శంషాబాద్‌లో చోటు చేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కొప్పళ జిల్లాకు చెందిన అమీర్ (50) డీసీఎం డ్రైవింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తన వాహనంలో కర్ణాటక నుంచి సరకును నింపుకొని సాతంరాయి పారిశ్రామిక వాడలోని మీనాక్షి పరిశ్రమకు వచ్చాడు. సరకును అన్‌లోడింగ్ చేస్తుండగా స్పృహ కోల్పోయాడు. గమనించిన పరిశ్రమ నిర్వాహకులు వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు.

నీటిలోనే ఊపిరొదిలిన చేపలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నీటి కాలుష్యం కారణంగా భారీగా చేపలు చనిపోయాయి. బెంగళూరు నగరంలోని ఎలక్ట్రానిక్ సిటీ సమీప చిక్కనాగమంగల చెరువులో వేలాది చేపలు చనిపోయి.. శుక్రవారం నీటిలో తేలాయి. చుట్టుపక్కల నివాసాల నుంచి వచ్చే వ్యర్థ నీరే వీటి మరణానికి కారణమని అధికారులు గుర్తించారు. కాలుష్య నియంత్రణ మండలి, పాలికె అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. మృతి చెందిన చేపలను గోతిలో పూడ్చిపెట్టారు. నీటి కాలుష్యమే ఈ దుస్థితికి కారణమని అధికారులు వివరించారు.



'వాల్మీకి' అక్రమాలపై పుస్తకం తెస్తాం

సండూరులో గృహప్రవేశం చేసిన గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, బళ్లారి గ్రామీణ నియోజకవర్గం ఎమ్మెల్యే బి.నాగేంద్ర వాల్మీకి కార్పొరేషన్‌లో చేసిన అక్రమాలకు సంబంధించిన వివరాలపై పుస్తకం ముద్రించి సండూరు నియోజకవర్గంలోని ప్రతిఇంటికీ అందజేస్తానని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా సండూరు పట్టణంలో గృహప్రవేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగేంద్ర చేసిన అక్రమాలపై లోకాయుక్త, సిట్ కేసు నమోదు చేసి ఒక్క రోజు విచారణ చేయకుండానే క్లీన్‌చిట్ ఇచ్చారు. ఇది ప్రభుత్వమే అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా బయటకు వస్తోందన్నారు. ప్రస్తుతం ఈడీ విచారణ చేసి ఛార్జిషీట్ దాఖలు చేసింది. త్వరలో సీబీఐ విచారణ చేస్తుందన్నారు.

పశ్చాత్తాపంతోనే కన్నీళ్లు పెట్టుకున్నారు

వాల్మీకి జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే బి.నాగేంద్ర కన్నీళ్లు పెట్టుకోంది చేసిన తప్పునకు పశ్చాత్తాపం కోసమే అన్నారు. నాగేంద్రను రాజకీయంగా అభివృద్ధి చేసింది నేను. ఇలాంటి వారిని పైకి తెచ్చినందుకు నేను పశ్చాత్తాపం చెందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సొమ్మును లూటీ చేశారు. ఈడీ ఛార్జిషీటులోని అంశాలను రెండు, మూడు రోజుల్లో పుస్తకం ముద్రించి విడుదల చేస్తానని తెలిపారు. వాల్మీకి నిధుల్లో అక్రమాలు జరగలేదంటే ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారని ప్రశ్నించారు. నాగేంద్ర ఏమి మాట్లాడినా.. కన్నీళ్లు పెట్టుకున్నా జిల్లా ప్రజలు నమ్మడం లేదన్నారు. అంతకు ముందు సండూరు పట్టణంలోని శివపుర సమీపంలో నివాసం, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సోదరుడు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భార్య లక్ష్మి అరుణ, కె.ఎస్.దివాకర్ ప్రత్యేక పూజలు చేసి గృహప్రవేశం చేశారు.



గృహ ప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, సతీమణి లక్ష్మి అరుణ

ఎన్నికల నేపథ్యం.. మద్యం నిషేధం

ఉడుపి: దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడలోని స్థానిక సంస్థలకు 21వ తేదీ ఉప ఎన్నిక జరగనుంది. ఫలితాలను 24న ప్రకటించనున్నారు. కోట శ్రీనివాస పూజారి తన స్థానానికి రాజీనామా చేసి, లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి సోమవారం అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలపై నిషేధాన్ని విధిస్తూ జిల్లాధికారి డాక్టర్ కె.విద్యాకుమారి ఆదేశాలు జారీ చేశారు.

సంపాదనతో సామాజిక సేవ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రయోగశాలలో తయారు చేసిన వజ్రాలతో (కృత్రిమ) చేసిన ఆభరణాలను సఫీనా ప్లాజాలో 'ఇకక్ష్' ప్రదర్శనకు ఉంచింది. ప్రదర్శనను కలైమామణి వసంత వైకుంఠ్, వివిధ రంగాలకు చెందిన హర్షిణి వెంకటేశ్, ఆర్తి భాటియా, వీణా జైన్, డాక్టర్ నుపుర్ హండ, జోరాని ఖలీలి శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విక్రయాలతో వచ్చిన లాభాలను దృష్టిలోపం ఉన్న బాలలకు కావలసిన పరికరాలు, చికిత్సలకు వినియోగిస్తున్నామని ఇకక్ష్ ప్రతినిధులు తెలిపారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులకు డీసీ అభినందన



విద్యార్థి దీపక్ బెళగల్లును అభినందిస్తున్న డీసీ దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ఆరుగురు క్రీడాకారులను శుక్రవారం జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ అభినందించారు. ఈ నెల 19నుంచి గోవాలో రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు జరుగనున్నాయి. స్థానిక ప్రౌఢదేవరాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి దీపక్ బెళగల్లు, వలిబాషా, హుసేన్‌బాషా, హుసేన్, అబ్బుల్లా, క్రీడాకారిణి విజయవాణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఆయుధాలు ఠాణాలో అప్పగించండి



జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి భారత సాయుధ దళాల చట్టం ప్రకారం ఈ నియోజకవర్గంలో తుపాకులు (ఆయుధాలు) పొందిన వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 25లోపు డిపాజిట్ చేయాలని జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. సండూరు తాలూకాలోకి వచ్చే గ్రామాలతో పాటు బళ్లారి తాలూకాలోకి వచ్చే వేణివీరాపురం, కుడతిని, కురుగోడు తాలూకాలోకి వచ్చే తిమ్మలాపురం, ఏకబెంచి గ్రామాల్లో పొందిన ఆయుధాలను వారు డిపాజిట్ చేయాలన్నారు. జాతీయ బ్యాంకుల వద్ద భద్రత నిర్వహించే సిబ్బంది మినహా మిగిలిన వారు డిపాజిట్ చేయాలన్నారు. మినహాయింపు పొందాలంటే తమ విజ్ఞప్తులను ఈ నెల 22లోపు పాలనాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కోతి దాడిలో మరొకరికి గాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకాలోని మెట్రి గ్రామంలో కొండ ముచ్చు కోతి దాడిలో గురువారం సాయంత్రం మరో వ్యక్తి గాయపడ్డాడు. పి.ఎం.తిప్పేశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హఠాత్తుగా మీదపడి కోతి దాడి చేసి గాయపర్చింది. అంతకుముందు రోజు ఓ దివ్యాంగుడు కోతి దాడిలో గాయపడ్డాడు. విషయం తెలిసి అటవీ అధికారులు కోతిని బంధించేందుకు గ్రామంలో బోను ఏర్పాటుచేయడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులకు నీరు- మట్టిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి అరవింద్

మాన్వి, న్యూస్‌టుడే: రైతులు మట్టి, నీటిపై కనీస అవగాహన కలిగి ఉండాలని మైరాడ సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అరవింద్ పేర్కొన్నారు. సిరివార తాలూకాలోని హీరా గ్రామంలో వాటర్‌షెడ్ సలహా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వాటర్‌షెడ్ యోజన వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ యోజన నాలుగు సంవత్సరాల పాటు రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. మట్టిని, నీటిని సంరక్షించుకోవటం, తక్కువ నీటితో సేద్యం చేయటం ఈ యోజన ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బెంగళూరు మైరాడ అధికారి సుధారామన్, ఉజలాంబె కలబురగి, సంగమేష్ కంబార్, రైతులు, సలహా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అబ్బా..ఇదేం బురద!

వానలకు రూపుమారిన రహదారులు | పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు



రహదారి బురదగా మారడంతో గొట్టంపై నడుచుకుంటూ వస్తున్న విద్యార్థిని



ఎల్లెల్సీ కాలనీ వంతెనపై మేటవేసిన బురద



అడుగడుగునా ఇబ్బందులు...ఎలా నడవాలి

బళ్లారి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. నగరంలో పలు రహదారులు బురదకుంటలను తలపిస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంటోన్మెంట్‌లోని సుధాక్రాస్ రైల్వే పైవంతెన పనులు జరుగుతున్నాయి. ఓవైపు పైవంతెన పనులు సగమే చేయడంతో రహదారి మొత్తం బురదమయమైంది. నిత్యం కంటోన్మెంట్ రైల్వేస్టేషన్, హోసపేటె తదితర ప్రాంతాల నుంచి బస్సులో వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు సుధాక్రాస్ (హోసపేటె రహదారి) కింద వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు. రహదారి మొత్తం బురదగా మారింది. కాలు తీసి కాలు వేయడానికి ఇబ్బందిగా తయారైంది. వరి నాట్లు వేయడానికి దున్నిన పొలం మాదిరిగా మారిపోయింది. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతూ నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు శుక్రవారం ఉదయం కనిపించాయి. అక్కడే పొక్లెయిన్లు, ఇతర వాహనాలు అక్కడే ఉన్న బురద మారింది. పక్కకు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రశాంత కాలనీ వైపు రహదారి ఉండటంతో రావడానికి ఇబ్బందిగా మారింది. వాహనాల్లో వచ్చే



అదుపు తప్పి కింద పడుతున్నారు. దీంతో వాహనాలను సెయింట్ ఫిలోమినా పాఠశాల ముందు గాంధీ విగ్రహం వద్ద వాహనాలను పార్కింగ్ చేసి వచ్చే పరిస్థితి నెలకొంది. సమీపంలో ఎల్లెల్సీ కాలనీ నుంచి పాదచారులు, వాహనదారులు రావడానికి అనుకూలంగా ఉన్నారు. గేటు వద్ద సిబ్బంది పెట్టి లోపలికి ఎవరినీ అనుమతించడం లేదు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బురదను తొలగించి నడుచుకుంటూ వెళ్లడానికి అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బురదకుంటగా మారిన రహదారి

గంగమ్మతాయికి తులాభారం



గంగావతిలో గంగమ్మతాయికి తులాభారం చేస్తున్న భక్తులు

గంగావతి,న్యూస్‌టుడే: పట్టణంలోని అగడి సంగణ్ణ క్యాంప్ రేణుకా ఎల్లమ్మ ఆలయం అర్చకురాలు గంగమ్మతాయికి భక్తులు శుక్రవారం తులాభారం వేశారు. పురాణ ప్రవచనకారులు రేణుకాస్వామి ఈ కార్యాక్రమాన్ని నెరవేర్చి మాట్లాడుతూ గత 45 సంవత్సరాలుగా ఈమె రేణుకా ఎల్లమ్మ సేవ చేస్తున్నారన్నారు. ఆలయం అభివృద్ధి చెందడమే కాక శరవన్నవరాత్రులను ఏటా వైభవంగా ఆచరిస్తూ భక్తులు అభిమానం చూరగొన్నారన్నారు. ప్రముఖులు రుద్రయ్యస్వామి, అశోక్‌గౌడ, వీరేశ్, బసవరాజ్ రామత్నాళ, శ్రీనివాస్, శ్యావి తిప్పణ్ణ పాల్గొన్నారు.

గౌరీ దేవికి పూజలు



గౌరీదేవికి హారతి ఇస్తున్న మహిళలు

కంప్లి, న్యూస్‌టుడే: ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక పేటె బసవేశ్వర ఆలయంలో గురువారం రాత్రి మహిళలు గౌరీ దేవికి పూజలు నిర్వహించారు. ఆలయంలో గౌరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి హారతులిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధీకృత స్థలంలోనే క్యాంటీన్ నిర్మించండి



అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న భాజపా నాయకులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగిలో ఇందిరా క్యాంటీన్‌ను అధీకృత స్థలంలో నిర్మించాలని భాజపా నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ మస్కి మాట్లాడుతూ స్థానిక నూతన బస్టాండు ఎదురుగా తాత్కాలిక స్థలంలో రూ.87 లక్షలతో క్యాంటీన్ నిర్మాణం జరుగుతుంది. తాత్కాలిక స్థలంలో నిర్మాణం వల్ల రూ.87 లక్షలు వృథా అయ్యే అవకాశం ఉంది. అధీకృత స్థలంలోనే క్యాంటీన్ నిర్మాణం చేపట్టాలన్నారు. తాత్కాలిక స్థలంలోనే నిర్మిస్తే ముందు జరగబోయే పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. వివిధ విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'కన్నడ సంస్కృతిని కాపాడుకోవాలి'



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్

సిరివార, (మాన్వి) : కన్నడ భాష, సంస్కృతిని, హోదాను కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరి ఊపిరీ కన్నడ కావాలని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ ఆకాంక్షించారు. కన్నడ సాహిత్య సమ్మేళన కన్నడజ్యోతి రథానికి పూజలు చేసి భువనేశ్వరి మాతకు ఆయన పూల మాల వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో ఎమ్మెల్యే పాటలకు నృత్యం చేస్తూ.. తహసీల్దార్ రవి ఎస్ అంగడి, నీటి పారుదలశాఖ ఏఈఈ విజయలక్ష్మి, సీడీపీఓ నాగరత్న నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలతో నృత్యం చేయించారు. తర్వాత ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు భూపనగౌడ, కసపా అధ్యక్షుడు సురేష్ హీరా, స్థానిక ప్రముఖులు చుక్కి సూగప్ప, రమేష్, ఎన్.ఉదయ్‌కుమార్, రంగనాథ్‌నాయక్, శివశరణ, కె.రాఘవేంద్ర, యమునూరప్ప, కన్నడ సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

నగర పాలికె సామాన్య సమావేశం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె సామాన్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయం ఆవరణలోని నజీర్ సభాభవనంలో నిర్వస్తున్నట్లు కమిషనర్ ఖలీల్‌సాబ్ తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు నిర్దిష్ట సమయంలో హాజరు కావాలని కోరారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



సమావేశాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

మాన్వి, న్యూస్‌టుడే : ప్రజల్లో పరివర్తన, మహిళల ఆర్థిక స్వావలంబన ధ్యేయంతో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్టు విధులు నిర్వహిస్తోందని ఆ సంస్థ ప్రాదేశిక డైరెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం తాలూకా స్థాయి ఒక్కూట సభ్యుల సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల రైతులు, మహిళలు, యువతీ యువకులకు వివిధ అంశాలపై మార్గదర్శనం, అవగాహన కల్పించి వారి జీవన విధానాల్లో మార్పు తీసుకుని రావటంలో సంస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తక్కువ వడ్డీకి రుణాల మంజూరు సదుపాయం కల్పించినట్లు చెప్పారు. లాభాపేక్ష లేకుండా డాక్టర్ వీరేంద్రహెగ్గడె, డాక్టర్ హేమావతి హెగ్గడె సంస్థను ముందుకు నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ మోహన్‌నాయక్, తాలూకా యోజనాధికారిణి సరస్వతి ప్రభు, జిల్లా జనజాగృతి సమితి సభ్యుడు మహబూబ్ మద్లాపూర్, రాయచూరు ఏడీబీ బ్యాంక్ మేనేజర్ విజయకుమార్, వెంకటేశ్, ధర్మస్థల సంస్థ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన ఒక్కూట మహిళా సభ్యులు

అన్నివర్గాల శ్రేయస్సుకే శివశక్తి సాంస్కృతిక భవనం



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న స్వామీజీలు, ప్రతినిధులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రజలందరికీ ఉపయోగపడేలా శివశక్తి సాంస్కృతిక భవనం అంకితం చేస్తామని శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డా.చన్న సిద్ధరామ పండితారాధ్యా శివాచార్య మహాస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని పినాకి ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భవన ప్రారంభోత్సవం, సామూహిక వివాహాల ముందస్తు పూర్వ సిద్ధతా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం, దాతల నుంచి సేకరించిన సుమారు రూ.7 కోట్లతో నిర్మించిన భవనాన్ని అక్టోబరు 24న లోకార్పితం చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన భవనం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తెస్తాం, అదే రోజు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తామన్నారు. సిరుగుప్ప పట్టణానికి శ్రీశైల మఠానికి దశాబ్దాల బాంధవ్యం ఉందని, మంచి పనులు తండ్రి సంకల్పం చేస్తే కొడుకు పూర్తి చేయ్యాల్సి ఉంటుందన్నారు. కంబాళి మఠం వీరభద్ర శివాచార్య స్వామి, బసవమఠం బసవభూషణ స్వామి, శ్రీశైల శాఖ మఠం కుమార పండితారాధ్యశ్రీ, మాజీ శాసనసభ్యుడు టి.ఎం.చంద్రశేఖరయ్య స్వామి, పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు చొక్కా బసవన గౌడ, మల్లికార్జున స్వామి, ఆర్.బసవలింగప్ప పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి



గ్యారంటీ పథకాల అమలును సమీక్షిస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్‌బాబు

గంగావతి,న్యూస్‌టుడే: ఈ-కేవైసీ లేనందున పలువురికి గ్యారంటీ పథకాలు అందడంలేదు, ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌బాబు సూచించారు. ఆయన శుక్రవారం గంగావతి తాలూకాలో ఈ పథకాల అమలును సమీక్షించారు. 57,369 రేషన్ కార్డులు ఉండి వీరిలో రెండువేల మందికి నగదు బదిలీ కావడం లేదన్నారు. ఈ-కేవైసీ లేనందునే వారికి ఈ పథకం అందడం లేదన్నారు. ఆహారశాఖ అధికారులు ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి అందరికీ అన్నభాగ్య నగదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెస్కాం అధికారులు గృహజ్యోతి వందశాతం అమలుకు ప్రయత్నించాలన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య సమస్యలు తలెత్తుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అధికారులు దీన్ని పరిష్కరించాలన్నారు. సమావేశంలో తాలూకా పంచాయతీ ఈవో లక్ష్మీదేవి, సమితి సభ్యులు మంజనాథ్ కలాల్, సమ్మిక్, ముస్తాక్, నాగమ్మ, అహ్మద్ పటేల్, ముత్తరాజ్, జెస్కాం ఏఈఈ మంజునాథ్, సీడీపీవో జయశ్రీ, ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి గ్రామీణ జెస్కాం వ్యాప్తిలోని 110/11కె.వి. హలకుంది ఉప కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 20న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు జెస్కాం అధికారి మోహన్‌బాబు తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే పారిశ్రామిక ప్రాంతం చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

నగర పరిధిలో.. బళ్లారి: బళ్లారి నగర 110/11కె.వి. వ్యాప్తిలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 20న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జెస్కాం అధికారి తెలిపారు. సిద్ధాపురం రహదారి, టపాల్ స్ట్రీట్, పారిశ్రామిక ప్రాంతం, గుగ్గరహట్టి పారిశ్రామిక ప్రాంతం, గుగ్గరహట్టి గ్రామం, ముండరగి, అంద్రాళ్, పాత్ర బూదిహాళ్, మంగమ్మ క్యాంపు, మించేరి, ఎస్.జె.కోటె తదితర చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

కురుగోడులో వాల్మీకి జయంతి



కురుగోడు తాలూకా యంత్రాంగం, వాల్మీకి మహర్షి వివిధ సంఘాల నేతృత్వంలో కురుగోడు పట్టణంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో పాటు సంఘం సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలో వాల్మీకి మహర్షి చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు. - **న్యూస్‌టుడే, బళ్లారి**

నేడు విద్యుత్తు వినియోగదారులతో సమావేశం

బళ్లారి : కురుగోడు జెస్కాం వ్యాప్తిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హెచ్.వీరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో విద్యుత్తు వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రాజ్యోత్సవాన్ని ఘనంగా ఆచరించాలి



కొప్పళలో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఆచరణపై చర్చిస్తున్న పాలనాధికారి నళిన్ అతుల్

గంగావతి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కొప్పళలో ఘనంగా ఆచరించాలని పాలనాధికారి నళిన్ అతుల్ అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం అధికారులతో సమావేశమై చర్చించారు. ఉదయం ఏడుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి కన్నడమాత భువనేశ్వరి ఊరేగింపు జరుగుతుందన్నారు. జిల్లా ఆట మైదానం దాకా జరిగే ఊరేగింపునకు జానపద బృందాలను రప్పించాలన్నారు. దీనికోసం ఉప సమితులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని అన్ని కూడళ్లు, రహదారులను కన్నడ బావుటాలతో అలంకరించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కన్నడ గేయాలకు మాత్రమే అవకాశం ఇవ్వాలన్నారు. అదనపు జిల్లాధికారి సిద్రామేశ్వర, సహాయక కమిషనర్ మహేశ్ మాలగిత్తి, కన్నడ,సాంస్కృతికశాఖ సహాయక సంచాలకులు కొట్రేశ్ మరబనళ్ళి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మనిషిలో మార్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: అహంకారాన్ని దూరం చేసుకుని, ఆధ్యాత్మికవైపు వెళ్లినప్పుడే మనిషిలో మార్పు సాధ్యమని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప పేర్కొన్నారు. స్థానిక హంసాంబ శారదాశ్రమ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజంతా ఉల్లాసంగా, ప్రశాంతంగా ఉండాలంటే కొంతసేపు ఆధ్యాత్మికవైపు మనసును మళ్లించాలని సూచించారు. ధార్మిక కార్యక్రమాలు, ప్రవచనాల్లో పాల్గొంటే మనిషిలో మార్పు వస్తుందని తెలిపారు. ఆశ్రమం నిర్మాణానికి వ్యక్తిగతంగా రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ మాట్లాడుతూ..మనిషిలో మార్పునకు దేశ, విదేశాల్లో రామకృష్ణ వివేకానంద ఆశ్రమాలు కృషి చేస్తున్నాయని కొనియాడారు. గదగ, విజయపుర రామకృష్ణవివేకానంద ఆశ్రమం అధ్యక్షుడు నిర్భయానంద సరస్వతి, కిర్లోస్కర్ ఉక్కు సంస్థ ఎండీ ఆర్.వి.గుమాస్తె, తుమకూరు, రాణిబెన్నూరు ఆశ్రమ నిర్వాహకులు విరేశానంద, ప్రకాశానంద, స్థానిక ఆశ్రమం నిర్వాహకులు ప్రబోధమయి పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని మహిళ మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర పట్టణ శివార్లలోని వెంకటేశనగర్‌లో నివాసముంటున్న భాగ్యలక్ష్మి(35) అనే మహిళ ఎలుకల మందు తిని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల మేరకు..కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న భాగ్యలక్ష్మి నొప్పిని భరించలేక బుధవారం రాత్రి ఇంట్లో ఉంచిన ఎలుకల మందు తిని అనారోగ్యం పాలైంది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం చిత్రదుర్గం ఆసుపత్రిలో వైద్యులకు చూపించారు. చిగటేరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు మృతురాలి తల్లి సరోజాబాయి తెలిపారు.

పర్యావరణహిత దీపావళిని ఆచరిద్దాం : నితీష్

రాయచూరు : దీపావళి పర్వదినాన్ని పర్యావరణ హితంగా ఆచరించాలని జిల్లా పాలనాధికారి నితీష్ ఒక ప్రకటనలో కోరారు. బాణసంచా వల్ల కాలుష్యం అధికమై పర్యావరణానికి నష్టం చేస్తుందని, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా హొసగొల్లరహట్టి గ్రామం వద్ద ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో చోదకుడు, అదే గ్రామానికి చెందిన చిక్కణ్ణ(41) ప్రమాద స్థలం వద్దనే మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగిందని పోలీసులు తెలిపారు. వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సును అధిగమించబోయి ఢీకొన్నట్లు చెప్పారు. శ్రీరాంపురం పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

18-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.90	1612.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	36,919	657
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,13,171	10,534
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.788	43.808

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు



ఎంపీ ప్రకాశ్‌నగర్‌లోని జలావృతమైన ఓ వీధి



ఆర్టీసీ కాలనీలో చొరబడిన వర్షంనీరు

హొసపేటెను ముంచెత్తిన వాన

హొసపేటె, న్యూస్‌టుడే: వరుణుడు హొసపేటెను ముంచెత్తాడు. గురువారం రాత్రి కురిసిన వర్షాలతో పట్టణం తడిసి ముద్దయింది. తెల్లవారుజాము వరకు ఏకధాటిగా కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు జలావృతమయ్యాయి. జబ్బుల్, సిద్ధలింగప్ప చౌకీ, విజయనగర కళాశాల మార్గం, ఆర్టీసీ, ఎంపీ ప్రకాశ్‌నగర్ కాలనీలు జలావృతమయ్యాయి. ఉరుములు, మెరుపులు, పిడుగుపాటుకు పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయడంతో అంధకారంలో కాలం వెళ్లదీశారు. పురాతన కమలాపుర చెరువు పొంగిపొర్లింది. రెవెన్యూ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

పొంగిపొర్లుతున్న కమలాపురం చెరువు →



చెళ్లకెర తాలూకాలో కుండపోత

• దెబ్బతిన్న 80 గృహాలు

చెళ్లకెర(చిత్రదుర్గం) : చెళ్లకెర తాలూకా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు 80 గృహాలకు నష్టం వాటిల్లగా 3 గృహాల్లోకి వరద నీరు చొరబడింది. శుక్రవారం అధికారులు తెలిపిన వివరాల మేరకు..చెళ్లకెర తాలూకాలో 15, చిత్రదుర్గంలో 24, హిరియూరులో 17, హొళల్కెరలో 14, హొసదుర్గంలో 5, మొళకాల్మూరులో 5 గృహాలు కూలిపోవడంతో ప్రజలకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. హొసదుర్గం పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న 3 గృహాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

వర్షపాతం వివరాలు

24 గంటల కాలంలో తాలూకాలోని నాయకనహట్టిలో 24 మి.మీ., హిరియూరులో 23, హొళల్కెరె, రామగిరిలో 22, ఐమంగళ, హొసదుర్గంలో 20, పరశురాంపురంలో 15, తళకు, దేవసముద్రంలో 11, మొళకాల్మూరులో 9 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నాయకనహట్టి, హిరియూరు, హొళల్కెర, హొసదుర్గంలో కురిసిన వర్షాలకు వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి.



కుండపోత వర్షాలకు నాయకనహట్టి వద్ద పొంగి ప్రవహిస్తున్న వాగు

గుండెపోటుతో ఏఎస్సై మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ఉన్న ఏఎస్సై శివశంకరాచారి (54) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. కామాక్షిపాళ్య ఠాణాలో ఆయన సేవలందిస్తున్నారు. ఉదయం ఠాణాకు వచ్చి, అక్కడి నుంచి గస్తీకి వెళుతున్న సమయంలో శ్వాసతీసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. తక్షణమే చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా మరణించారు. ఆయన మృతికి పలువురు ఉన్నతాధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

గోడకూలి వృద్ధురాలు..

యాదగిరి, న్యూస్‌టుడే : వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇంటి పునాదుల్లోకి నీరు వెళ్లి గోడ కూలిన ఘటనలో గుంజాలమ్మ (68) అనే వృద్ధురాలు మరణించింది. ఆమె సోదరుడు చిన్నపాటి గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. గురుమఠకల్ తాలూకా చింతనహళ్లి గ్రామంలో శుక్రవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. గురుమఠకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వరసిద్ధుడికి చాపలు విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి చెందిన డార్మెటరీ(విశ్రాంతి భవనం)కి అవసరమైన 150 చాపలను కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు చెందిన దాతలు రఘురామయ్య, రమేష్ బాబులు ఆలయ ఈవో పి.గురుప్రసాద్‌కు శుక్రవారం అందించారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు (హాప్‌కామ్స్- కిలో.. రూ.లలో)




బీన్స్- 125
క్యారెట్- 65
బీరకాయలు- 45
క్యాబేజి- 25
సొరకాయ- 35
దొండకాయలు- 35
పొట్లకాయ- 35
టమాటా(నాటు)- 65
టమాటా- 55
గుమ్మడి- 35
ఆలుగడ్డ- 60
ఉల్లి (మేలురకం)- 70
ఉల్లి (మామూలు)- 55
వెల్లుల్లి -420
సాంబారు ఉల్లి- 120
బీట్‌రూట్- 25
వంకాయలు- 35
బెండకాయలు- 28
ముల్లంగి- 40
నిమ్మకాయ- 270
వాషింగ్టన్ ఆపిల్- 325
సిమ్లా ఆపిల్- 145
గ్రీన్ ఆపిల్- 335
అరటి కాయలు- 55
సపోటా- 45
పైనాపిల్- 35
బొప్పాయి- 40
ఆరంజి- 70
బత్తాయి- 65

హంపనా.. అక్షర విలాసం!

కన్నడ వైభవానికి నిరంతర కృషి



మైసూరు దసరా వేడుకల్లో హంపా నాగరాజయ్యను సత్కరించిన ప్రముఖులు



హంపనా రాసిన గ్రంథాల్లో ఒక ఆణిముత్యం..



సతీమణి కమలతో నాగరాజయ్య

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : భాషా శాస్త్రజ్ఞుడు, సాహితీ పరిశోధకుడు, జైన చరిత్ర విజ్ఞాన వేత్త ఆచార్య హంప నాగరాజయ్య కన్నడ సారస్వత లోకానికి ఒక వరంగా కన్నడిగులు భావిస్తారు. 'హంపనా' అనే కావ్యనామంతోనే ఆయన ప్రసిద్ధి చెందారు. కన్నడ సాహిత్య ప్రపంచంలో తనదైన ముద్ర వేశారు. ఆ కృషి ఫలితమే.. ఇటీవల చారిత్రక- ప్రపంచ ప్రఖ్యాత మైసూరు దసరా సంబరాల ముఖ్యఅతిథిగా ప్రభుత్వం ఆయనను ఎన్నుకుని- వేడుకలను ప్రారంభించే అవకాశం పొందారు. చిక్కబళాపుర జిల్లా గౌరీబిదనూరు తాలూకా హంపసంద్ర గ్రామానికి చెందిన పద్మావతమ్మ- పద్మనాభయ్య దంపతులకు ఈ సరస్వతీ పుత్రుడు జన్మించారు. గౌరీబిదనూరు, మండ్య, మధుగిరిలో విద్యనభ్యసించారు. మైసూరులోనే ఆయనకు కువెంపు, డి.ఎల్.నరసింహాచార్, తీనం శ్రీకంఠయ్య, జవరేగౌడ తదితర సాహితీదిగ్గజాల మార్గదర్శనంలో భాషాజ్ఞానం పెంచుకుని స్నాతకోత్తర పట్టా (ఎంఏ) అందుకున్నారు. ఆచార్య ముగళీ ఆధ్వర్యంలో 'వడ్డారాధనే...సమగ్ర అధ్యాయ' అనే అంశంపై పరిశోధక పత్రం సమర్పించి బెంగుళూరు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ గౌరవం పొందారు.

- విద్యాభ్యాసానంతరం బోధనారంగంలోకి అడుగుపెట్టారు. మైసూరు మహారాణి కళాశాలలో లెక్చరర్‌గా వృత్తిజీవితాన్ని ప్రారంభించారు. మండ్య, దావణగెరె, శివమొగ్గ, బెంగుళూరు కళాశాలల్లో విధులు కొనసాగించారు. ప్రతిభావంత శిష్యులను తీర్చిదిద్దారు. విద్యార్థిలోకానికి అత్యంత ప్రీతిపాత్రుడిగా పేరొందారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ అధ్యయన కేంద్రం ఆచార్యుడిగా, ఆ విభాగ సంచాలకుడిగా, మంగళూరు విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యుడిగానూ, కన్నడ సంస్కృతి శాఖ, జైన పరిశోధన సంస్థ సంచాలకుడిగా, రాష్ట్రకవి కువెంపు ప్రతిష్ఠాన అధ్యక్షుడిగా సేవలందించారు.
- ప్రస్తుతం.. 88 సంవత్సరాల వయసులో అక్షర విన్యాసంలో తనకు సాటెవరూ లేరనే రీతిలో కలం కదిలిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. కన్నడ సాహిత్యపరిషత్ గౌరవ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలతో చరిత్ర సృష్టించారు. ఆయన పాలనాకాలంలోనే జానపద, విశ్వకోశ, జానపద వైద్యకోశ (నిఘంటువు), బెళ్లి బిట్ట బళ్లి మాలే, మక్కళ పుస్తక మాలే, సమ్మేళనాధ్యక్షుల భాషణమాలే, హళెగన్నడ కావ్యగళ గద్యానువాద మాలే, కవి కావ్యమాలె.. తదితర 500 గ్రంథాలను ప్రచురించడం ఓ రికార్డు!
- హంపనా సవ్యసాచి రచయితగా గుర్తింపు పొందారు. ఆయన ఏకంగా వందకు పైగా పుస్తకాలను కన్నడ, ఆంగ్ల భాషల్లో రచించారు. పరిశోధన వీరి ప్రథమ లక్ష్యం, భాషా విజ్ఞానం, జానపద అనువాదం, నవలలు, ప్రబంధాలు, బాలసాహిత్య, కావ్యం, విమర్శ, జీవనచరిత్రల అంశాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన రాసిన 'చారు వసంత' అనే మహాకావ్యం ఎంతో ప్రసిద్ధి చెందింది. అనేకానేక భాషల్లోకి ఇది అనువదించారు.
- ఆచార్య హంపనా.. లెక్కలేనన్ని పురస్కారాలు దక్కించుకున్నారు. కన్నడ సాహిత్య అకాడమీ, రాజ్యోత్సవ పురస్కారాలతో పాటు బాలసాహిత్య జాతీయ అవార్డు అందుకున్నారు. చాముండరాయ, కావ్యానంద, పంప, హంపీ విశ్వవిద్యాలయం నాడోజ పురస్కారాలు పొందారు. 'జైనలోక రత్నం' అని ఆయనను కీర్తిస్తారు. జైన సంస్కృతిపై హంపనా అనేకానేక పరిశోధనలు చేయడమే దీనికి కారణం. ఆయన సతీమణి కమలా హంపనా కన్నడ సారస్వత లోకానికి అమూల్య రచనలెన్నో అందించడం ప్రస్తావనార్హం.

బంగ్లా పౌరుల నిర్బంధం

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ నగరంలో అక్రమంగా ఉంటున్న ఎనిమిది మంది బంగ్లా పౌరులను సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. మహ్మద్ మాణిక్, హకీం అలి, సుజోన్, ఇస్మాయిల్, కరీం, సలాం, రాజికుల్, ఉస్మాన్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహ్మద్ మాణిక్ మొదట దొరికిపోయాడు. ఆ వ్యక్తిని విచారించగా మిగిలిన వారి పేర్లు చెప్పాడు. నకిలీ ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులను వీరు చేయించుకున్నారు. భవన నిర్మాణ పనుల కోసం ఉస్మాన్ వీరిని అక్రమ మార్గంలో బంగ్లాదేశ్ నుంచి శివమొగ్గకు తీసుకువచ్చాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

పోలీసు ఠాణాలో దాడి

మంగళూరు, న్యూస్‌టుడే : కార్లు ఒకదానికి మరొకటి ఢీకొన్న ఘటనకు సంబంధించి పోలీసు ఠాణాకు వచ్చిన బజరంగదళ నాయకుడు అర్జున్ మాడూరుపై కేరళలోని కాసరగోడుకు చెందిన మహ్మద్ ఆసిఫ్ అనే వ్యక్తి దాడి చేశాడు. అర్జున్, ఆసిఫ్ ఇద్దరూ ఒకరిపై మరొకరు గొడవ పడి కేసు పెట్టుకునేందుకు ఠాణాకు బుధవారం రాత్రి చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే అర్జున్‌పై అతను దాడి చేసి గాయపరిచాడు. బాధితుడ్ని దేరళకట్టెలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. నిందితుడ్ని తమకు అప్పగించాలంటూ హిందూ సంఘాల కార్యకర్తలు ఠాణా ముందు ధర్నాకు దిగారు.

శ్రీరామసేన నిరసన

గదగ, న్యూస్‌టుడే : లక్ష్మేశ్వర పట్టణంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గోసావి సముదాయానికి చెందిన యువకులపై పోలీసులు దాడి చేశారని శ్రీరామసేన ఆరోపించింది. గురువారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో శ్రీరామసేన రాష్ట్ర కార్యదర్శి రాజు ఖానప్పనవర విలేకరులతో మాట్లాడారు. ఎస్సై ఈరణ్ణ రిత్తి, ఇతర సిబ్బంది లాఠీలతో యువకులను కొట్టి పంపించారని ఆరోపించారు. ఈరణ్ణ రిత్తిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చారు.



వర్తక వ్యవహారాలకు ప్రత్యేకించిన భవంతుల ఊహా చిత్రం ఇదిగో..



బెంగళూరు నగర శివార్లలోని విమానాశ్రయం..

విమానాశ్రయం వాకిట వాణిజ్య వైభవం!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో బిజినెస్ పార్కు నిర్మాణాన్ని చేపడుతున్నామని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ ప్రకటించింది. బిజినెస్ పార్కు నిర్మాణానికి 17.7 ఎకరాల భూమిని సంస్థ గుర్తించింది. గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌గా దీన్ని అభివృద్ధి చేయడం ద్వారా 3.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు, ఏటా రూ.50 వేల కోట్ల డాలర్ల లావాదేవీలకు అవకాశం కలుగుతుందని బీఐఏఎల్ సీఈఓ రావు మునుకుట్ల తెలిపారు. విమానాశ్రయం పరిధిలోని నాలుగు బ్లాకుల్లో తలెత్తనున్న ఈ పార్కు దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు వేగంగా వచ్చి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ వ్యాపార, ఉద్యానాలు, విద్య, ఆరోగ్య కేంద్రాలు, పరిశోధన, అభివృద్ధి, మనోరంజన, ఆతిథ్య కేంద్రాలు ఈ బిజినెస్ పార్కులో అందుబాటులో ఉంటాయని వివరించారు. గత ఏడాది ఈ విమానాశ్రయం నుంచి 37.5 మిలియన్ల మంది ప్రయాణించగా, 2030 నాటికి ఈ సంఖ్య 90 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశామన్నారు. బిజినెస్ పార్కు ఏర్పాటుతోనూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని ఆయన వివరించారు.

అమ్మా.. ఎందుకిలా చేశావ్?

ఫేస్‌బుక్ ప్రేమలోపడి తాళినే తెంచేసుకుంది

బెళగావి, న్యూస్‌టుడే : కుందానగరి బెళగావిలో సంచలనానికి కారణమైన ఓ హత్య కేసు కొత్త మలుపుతిరిగింది. ఆంజనేయనగర నివాసి, భూ వ్యాపారి సంతోష్ పద్మణ్ణవర (47) ఈ నెల 9న గుండెపోటుతో మరణించారు. సదాశివనగర శ్మశానవాటికలో పదో తేదీ అంత్యక్రియలు ముగిశాయి. తన తండ్రి మరణం అనుమానాస్పదంగా ఉందని సంజనా మాళమారుతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో సీసీ కెమెరా ఫుటేజీను కొన్ని చోట్ల తొలగించినట్లు ఆమె గుర్తించారు. పోలీసు కమిషనర్ యడా మార్టిన్ మార్బన్యాంగ్ ఈ అంశంపై స్పందించి మృతదేహాన్ని బయటకు తీయించి, పంచనామా చేయించారు. సంజన ఫిర్యాదుతో సంతోష్ భార్య ఉమ పద్మణ్ణవర, ఆమె స్నేహితుడు శోభిత్ గౌడ, వారిద్దరితో పని చేస్తున్న పవన్ కరియా, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తానే ఈ హత్య చేయించానని సంతోష్ భార్య ఉమ (42) అంగీకరించిందని పోలీసులు వెల్లడించారు. మంగళూరుకు చెందిన శోభిత్ గౌడ ఆమెకు ఫేస్‌బుక్‌లో పరిచయం అయ్యాడు. ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. అడ్డుగా ఉన్న భర్తను తప్పించేందుకు గొంతు నులిమి హత్య చేశారు. అతను గుండెపోటుతో మరణించారని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు. తండ్రి మరణం అనంతరం ఇంట్లోని సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించిన, తనకు పరిచయం లేని వ్యక్తులు ఇంట్లోకి వచ్చి వెళ్లడాన్ని సంజన గుర్తించింది. తల్లి ప్రవర్తన అనుమానంగా అనిపించింది. విచారణలో సంజన భావించినట్లు తల్లే తన ప్రియునితో కలిసి హత్య చేయించిందని తేలిందని పోలీస్ అధికారులు వివరించారు.



పంచనామా చేస్తున్న పోలీసులు (ఎడమ), సంతోష్ పద్మణ్ణవర (కుడి)

ముంపు ముప్పు తప్పించే చర్యలు షురూ



జక్కసంద్ర రాజకాలువలో పూడిక తొలగింపు పనులు



తొలగించిన పూడికను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగర పరిధి రాజకాలువల్లో పూడిక తొలగించే పనులు వేగమందుకున్నాయి. బెంగళూరు లోతట్టు ప్రదేశాలు ముంపునకు గురికాకుండా అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న పనులపై తాజాగా సమీక్షించి పలు సూచనలు చేశారు. కాలువల్లో పూడిక పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించడంతో ఆ దిశగా అడుగు ముందుకేశారు. ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రదేశాల్లోని రాజకాలువల్లో పూడిక తొలగించే పనులను త్వరగా చేపట్టారు. వర్షాల కారణంగా ముంపునకు గురికాకూడదనే ఉద్దేశంతో అధికారులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. రాజకాలువలతో పాటు రహదారి పక్కన ఉన్న వాననీటి కాలువల్లో నీరు సాఫీగా ప్రవహించడానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. లోతట్టు ప్రాంతంలో కీలకమైన అగర సమీప జక్కసంద్ర రాజకాలువ శుభ్రం చేయడానికి ఐదు జేసీబీ యంత్రాలు ఉపయోగిస్తున్నారు. అక్కడ పూడిక తొలగించకపోతే అగర, హెచ్.ఎస్.ఆర్ లేఔట్, కోరమంగల బిడ్ ప్రదేశాలు ముంపు పాలవుతాయి. ఇప్పటికే వారం రోజులుగా వానలు కొనసాగుతున్నాయి. అనేక కాలువలు పొంగి ముంపు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. కోరమంగల, మడివాళ, బెళ్లందూరు, మారతహళ్లి, సర్జాపురలో సమస్య తీవ్రంగానే ఉంది. సుమారు 650 కిలోమీటర్ల పొడవున్న నాలుగు రాజకాలువల్లో ఇప్పటి వరకు 350 కిలోమీటర్ల పరిధి వరకు శుభ్రం చేశారు. మెజిస్టిక్ నుంచి బెళ్లందూరు వరకు కోరమంగల రాజకాలువ చిన్నవానకూ సమస్య తెచ్చిపెడుతోంది. దీని పరిధిలో ముంపు ప్రాంతాలు ఎక్కువ కావడంతో అన్ని వేళలా పాలికె అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.



రహదారిపై నీరు ఆగకుండా.. కాలువల్లోకి మళ్లించడానికి రంధ్రాల ఏర్పాటు

నీటిలోనే ఊపిరొదిలిన చేపలు



బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నీటి కాలుష్యం కారణంగా భారీగా చేపలు చనిపోయాయి. బెంగళూరు నగరంలోని ఎలక్ట్రానిక్‌సిటీ సమీప చిక్కనాగమంగల చెరువులో వేలాది చేపలు చనిపోయి.. శుక్రవారం నీటిలో తేలాయి. చుట్టుపక్కల నివాసాల నుంచి వచ్చే వ్యర్థనీరే వీటి మరణానికి కారణమని అధికారులు గుర్తించారు. కాలుష్య నియంత్రణ మండలి, పాలికె అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. మృతి చెందిన చేపలను గోతిలో పూడ్చిపెట్టారు. నీటి కాలుష్యమే ఈ దుస్థితికి కారణమని అధికారులు వివరించారు.

సంపాదనతో సామాజిక సేవ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రయోగశాలలో తయారు చేసిన వజ్రాలతో (కృత్రిమ) చేసిన ఆభరణాలను సఫీనా ప్లాజాలో 'ఇకక్ష్' ప్రదర్శనకు ఉంచింది. ప్రదర్శనను కలైమామణి వసంత వైకుంఠ్, వివధ రంగాలకు చెందిన హర్షిణి వెంకటేష్, ఆర్తి భాటియా, వీణా జైన్, డాక్టర్ నుపుర్ హండ, జోరాని ఖలీలీ శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విక్రయాలతో వచ్చిన లాభాలను దృష్టిలోపం ఉన్న బాలలకు కావలసిన పరికరాలు, చికిత్సలకు వినియోగిస్తున్నామని ఇకక్ష్ ప్రతినిధులు తెలిపారు.



జ్యోతి వెలిగిస్తున్న హర్షిణి వెంకటేశ్, వసంత వైకుంఠం, అర్తిభాటియా తదితరులు

ఎన్నికల నేపథ్యం.. మద్యం నిషేధం

ఉడుపి, న్యూస్‌టుడే : దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడలోని స్థానిక సంస్థలకు 21వ తేదీ ఉప ఎన్నిక జరగనుంది. ఫలితాలను 24న ప్రకటించనున్నారు. కోట శ్రీనివాస పూజారి తన స్థానానికి రాజీనామా చేసి, లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి సోమవారం అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలపై నిషేధాన్ని విధిస్తూ జిల్లాధికారి డాక్టర్ కె.విద్యాకుమారి ఆదేశాలు జారీ చేశారు.





వాసవీశాంతిధాంలో కర్ణాటక రాష్ట్రం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డి.ఎస్.అరుణ్, ప్రతిభ దంపతులు

వాసవీ శాంతిధాంలో పంచామృతాభిషేకాలు

పెనుగొండ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలో వెలసిన వాసవీశాంతిధాం శుక్రవారం కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. గోమాత పూజ, మరకత వాసవీ కన్యకా పరమేశ్వరికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, వాసవీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం భాజపా ఎమ్మెల్సీ డి.ఎస్.అరుణ్, ప్రతిభ దంపతులు పాల్గొన్నారు. పలువురు భక్తులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ(షిమోగా)లో వాసవీ అమ్మవారిని ప్రతిష్ఠాపన చేసి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 ఫిబ్రవరి నెలలో వంద సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించాలని అమ్మవారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నామని వివరించారు.

పత్తి రైతుల గోడు ఆలకించరూ..

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని తాలూకాలు, ఫిర్కా ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను స్థాపించాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాన్ని తెరవాలని కోరుతూ 'అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల జిల్లా సంఘటన' శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద బైఠాయించింది. కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సంఘటన ప్రతినిధులు, రైతులు నినాదాలు చేశారు. అనంతరం సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ రూ.5500 నుంచి రూ.7500 పలుకుతోందని, ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా చేతికి రాదని తెలిపారు. అతివృష్టి వల్ల దిగుబడులు కోల్పోయిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ ఆరంభంలోనే ధర లేకపోతే ముగింపు సమయానికి ఇంకా పడిపోయే అవకాశముందని వివరించారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. క్వింటాల్‌కు రూ.10 వేలు ఖరారు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని విశ్లేషించారు. రాష్ట్రం ప్రోత్సాహధనం చెల్లించాలని, సూటు పేరిట కొంత పత్తిని తీసి వేయకుండా వ్యాపారులకు సూచించాలన్నారు. మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పాలనాధికారి ఏపీఎంసీ అధికారులు, రైతులు, పత్తి వ్యాపారులు, రైతు సంఘాలతో సమావేశం జరపాలని డిమాండ్ చేశారు.



సీసీఐ కార్యాలయం వద్ద బైఠాయించిన అన్నదాతలు

భూమికి పున్నమి పూజలు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మల్నాడు, ధార్వాడ తదితర ప్రాంతాల రైతు కుటుంబాల సభ్యులు గురు, శుక్రవారాల్లో భూమికి పున్నమి పూజలు నిర్వహించారు. దసరా అనంతరం వచ్చే పౌర్ణమి రోజు పొలాలకు వెళ్లి చేసుకునే పూజలను భూమి హుణ్ణిమ, శేగి హుణ్ణిమ అని వ్యవహరిస్తారు. విజయదశమి రోజూ ఈ పూజకు కావలసిన బుట్టలను సిద్ధం చేసుకుంటారు. ఆ బుట్టలను మట్టితో అలుక్కుంటారు. ఏడు రకాల వేపుళ్లు, అడవిలో దొరికే 101 రకాల ఆకులు, ఆకుకూరలు, కీరదోస ఉపయోగించి చేసే కుడుములు తదితరాలను ఆ బుట్టల్లో ఉంచుకుని, కుటుంబ సభ్యులందరూ తమ పొలానికి వెళతారు. తోటలో ఉన్న చెట్లకు, నాట్లు వేయబోయే పొలాల్లో పూజ చేసుకుంటారు. కొంత ఆహారాన్ని పొలం చుట్టూ చల్లుకుంటారు. కుటుంబ సభ్యులందరూ అక్కడే భోజనం చేసి, రాత్రి సమయానికి ఇళ్లకు తిరిగి వస్తారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా పలు గ్రామాల్లో ఈ భూమి హుణ్ణిమను ఆచరిస్తుంటారు.



పొలంలో మొక్కకు పూజ చేస్తున్న కుటుంబ పెద్ద

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

నగరంలో 21న అర్చకుల సమస్యలపై సమావేశం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ అధ్వర్యంలోని ఆలయాల్లో అర్చక వృత్తి నిర్వహిస్తున్న పూజారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు 21న నగరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు అఖిల కర్ణాటక హిందూ దేవస్థానాల అర్చకులు, అగమికర్లు, ఉపాధివంతులు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎన్.దీక్షిత్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ఆలయాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధికార ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. నగరంలోని పుర భవన్‌లో జరిగే సమావేశంలో సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్య మంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

వాల్మీకి విగ్రహం తొలగింపుపై ఆందోళన



అధికారులకు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

పావగడ, న్యూస్‌టుడే: తుమకూరు జిల్లా కొరటగెరె పట్టణంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని తాలూకా పాలకవర్గం తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం పావగడ పట్టణంలో వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాలేగార్ లోకేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. జిల్లాధికారులు కల్పించుకొని విగ్రహం, నామ ఫలకం ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం శిరస్తార్ చంద్రశేఖర్, సీఐ ఎం.ఆర్.సురేశ్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు ఈరణ్ణ, బేకరి నాగరాజు, కె.ఆర్.వి. లక్ష్మినారాయణ, ఆటో సత్తి, బెళ్ళిబట్లు బలరాం, నాగేంద్ర, అశ్వత్థ, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు కబుర్లు

సక్రమంగా నిత్యావసరాల సరఫరా

హోసూరు, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లాలో చౌక దుకాణాల నుంచి సరకులను రేషన్ కార్డుదారులకు సక్రమంగా అందించాల్సిన బాధ్యత పౌర సరఫరాల శాఖపై ఉందని ఎంపీ గోపినాథ్ అన్నారు. ఆయన శుక్రవారం కలెక్టర్ సరయు అధ్యక్షతన జిల్లాలోని రేషనుకార్డు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. పౌర సరఫరా శాఖ అధికారులు పేదలకు సరకులు సక్రమంగా అందించాలని ఆదేశించారు. తొలుత 13 మంది పర్యవేక్షణ కమిటీ సభ్యులు కార్డుదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ సాధనైకురల్, పౌర సరఫరాల అధికారి గీతారాణి, సహకార సంఘాల జేఆర్ కుమార్, పర్యవేక్షక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తం

హోసూరు, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.ఎం. సరయు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం కార్యదర్శి పుష్ప, హోసూరు సబ్-కలెక్టరు ప్రియాంకతో కలిసి సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల రక్షణకు తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేయాలని, జేసీబీ వాహనాలు, మోటారు పడవలు, జనరేటర్లు, ఇసుక మూటలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ సరయు

శిథిలావస్థకు చేరిన భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలను గుర్తించి అందులో ఎవరూ లేకుండా చూడాలన్నారు. అత్యవసర వేళలో సమాచారాన్ని అందించడానికి హెల్ప్‌లైన్లను అందబాటులో తేవాలన్నారు. కార్పొరేషన్లు, పురపాలికల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టరు మహదేవన్, అగ్నిమాపక అధికారి వేలు, ఇంజినీరు అరివళి, ప్రత్యేక తహసీల్దారు జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

19న ఎన్‌బీకే సినీ స్వర్ణోత్సవం

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు తాలూకా బుక్కసాగరం గ్రామంలో ఎన్టీఆర్ కళావేదిక నిర్వాహకులు 19న సాయంత్రం ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి నటులు, రచయిత తనికెళ్ల భరణి, జనార్దన మహర్షి, సంగీత దర్శకుడు పాణి తదితరుల అతిథులుగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. హోసూరు, డెంకణీకోట, తళి, శూలగిరి, వేపనహళ్లి, ఉద్దనపల్లి బేరికె నుంచి అధిక సంఖ్యలో తెలుగు అభిమానులు, ప్రజాప్రతినిధులు వస్తారనివారు వెల్లడించారు.



నిరుపేదలకు దాతల చేయూత

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు హోసూరు తాలూకాలో పంటలు నాశనమయ్యాయి. పట్టణంలోని పలు వీధులు అపరిశుభ్రంగా మారాయి. చాలామంది నిరుపేదలు నిరాశ్రయులయ్యారు. సరైన తిండిలేక నీరసించారు. ఈ నేపథ్యంలో కృష్ణగిరి జిల్లా పశ్చిమ మైనార్టీ సంక్షేమ విభాగం నిర్వాహకుడు బషీర్‌అహ్మద్ వారికి ఆహార పొట్లాలు, నీటి సీసాలు పంపిణీ చేశారు. ఆయన వెంట సహాయకులు పిల్లప్ప, అర్జున్, గణపతి, జగదీష్ తదితరులున్నారు. **- న్యూస్‌టుడే, బాగలూరు (బేరికె)**

ఎన్నాళ్లీ గుంతల రహదారులతో తిప్పలు?

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో సంచార పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పలు మార్గాల్లో వారే స్వయంగా రోడ్లపై పడిన గుంతల్లో సిమెంటు మిశ్రమం వేసి పూడ్చుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కార్మికులతో పని చేయిస్తున్నారు. వైట్‌ఫీల్డ్, బెళ్లందూరు, సర్జాపుర, అవుటర్ రింగ్ రోడ్డు, ఫకీర్‌నగర్, పీణ్యా పారిశ్రామికవాడ, మంజునాథ్ నగర, యలహంక ఉపనగర, ఎంఎస్‌పాళ్య, హెబ్బాళ్, సంజయ్‌నగర తదితర ప్రాంతాల్లో గుంతలు పూడ్చి వాహన సంచారానికి అనుకూలం చేశారు. శాశ్వత పరిష్కారం చూపాలని పాలికె అధికారులకు నిత్యం లేఖలు రాస్తున్నా, ఛాయాచిత్రాలు తీసి పంపిస్తున్నా స్పందించడం లేదని సంచార పోలీసు అధికారులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిస్తే సంచార నియంత్రణ సవాలుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లీ గుంతల మార్గాలతో తిప్పలు పడాలని ఓవైపు నగరవాసులు మరోవైపు సంచార పోలీసులు వాపోతున్నారు. స్పందించిన పాలికె అధికారులు వర్షాలు నిలిచిపోయిన తర్వాత శాశ్వత పరిష్కార చర్యలు చేపడతామని సెలవిచ్చారు.



టీసీపాళ్య రోడ్డులో ఇలా...



వైట్‌ఫీల్డ్ మార్గంలో గుంతల్లో సిమెంట్ మిశ్రమం వేస్తున్న సంచార పోలీసులు

ముస్లిం సోదరుల నిరసన



సమాజానికి శాంతి సందేశం అందించిన ప్రవక్తను అవహేళన చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన అధ్యాత్మిక గురువును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలంటూ శుక్రవారం వందలాది ముస్లిం సోదరులు చిత్రదుర్గం పట్టణ వీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత పలు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు ముగించుకొని ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జిల్లా పాలనాధికారికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రదర్శనకు మత గురువులు మౌలానా గులాం జిలానీ, సయ్యద్ అరఫ్, శాహిద్ ఆలం, కాంగ్రెస్ జిల్లా సమితి అధ్యక్షుడు తాజ్‌పీర్ నేతృత్వం వహించారు.

- న్యూస్‌టుడే, చిత్రదుర్గం

నగరంలో జపాన్ హార్డ్‌వేర్ కేంద్రం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: జపాన్‌లో ఇంటీరియర్ డిజైన్, వినూత్న హార్డ్‌వేర్ ఉత్పత్తుల తయారీదారు సుగత్సున్ సంస్థ తన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను యూనిటీ బిల్డింగ్ ఆవరణలో శుక్రవారం ప్రారంభించింది. భారత దేశంలో 16 ఏళ్లుగా తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా, కర్ణాటకలో తమకు ఇదే మొదటి కేంద్రమని సంస్థ భారతీయ విభాగం ఎండీ అనిల్‌రాణా తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అర్జీ తోసిపుచ్చిన న్యాయస్థానం

మండ్య, న్యూస్‌టుడే: చెలువనారాయణ స్వామి ఆలయ భూమి కబ్జాకు పాల్పడినట్లు స్థానికంగా ఉంటున్న కరగం రామప్రియ కుటుంబంపై వచ్చిన ఆరోపణలపై పాండవపుర సివిల్ న్యాయస్థానం విచారణ చేపట్టింది. కబ్జాకు గురైందని చెబుతున్న రెండు ఎకరాల భూమి సర్వేకు మేలుకోటె పంచాయతీ అధికారికి పూర్తి అధికారాలు ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. సర్వేకు రావాలని అధికారులు తనకు ప్రతిసారీ నోటీసులు పంపిస్తున్నారని, సర్వే చేయకుండా స్టే ఇవ్వాలని కరగం రామప్రియ న్యాయ స్థానంలో అర్జీ వేశారు. దాన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది.

రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : దాసరహళ్లి నియోజకవర్గం శెట్టిహళ్లి అయ్యప్పణ్ణ కాలనీ, మూకాంబిక బడవాణి, రైల్వే గేటు వద్ద, రాఘవేంద్ర బడవాణిలోరోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మునిరాజు భూమిపూజ చేసి మాట్లాడారు. పనులు జరిగే సమయంలో ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా గుత్తేదారులు ప్రత్యామ్నాయ మార్గాలను తాత్కాలికంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇంజినీర్లు ఎక్కడెక్కడ రోడ్డు సమస్యలున్నాయో గుర్తించి ఉన్నతాధికారులు దృష్టికి తేవాలని స్పష్టం చేశారు. ఆయన వెంట భాజపా నాయకులు సోమశేఖర్, సురేష్ తదితరులున్నారు.

ఫుట్‌బాల్ అకాడెమీతో నైపుణ్యాభివృద్ధి




యువ ఆటగాళ్లతో బైచుంగ్ భూటియా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అఖిలభారత ఫుట్‌బాల్ సమాఖ్య గుర్తింపు పొందిన బీబీఎఫ్‌ఎస్ అకాడమి యువ క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధికి దోహదపడుతుందని ప్రముఖ ఫుట్‌బాల్ ఆటగాడు బైచుంగ్ భూటియా అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని బీబీఎఫ్‌ఎస్ నూతన రెసిడెన్షియల్ ఫుట్‌బాల్ అకాడెమీని ప్రారంభించి మాట్లాడారు. ఆకాష్ అంతర్జాతీయ పాఠశాల సహకారంతోప్రారంభమైన ఈ అకాడెమీలో విస్తారమైన మైదానాలు, టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టులు, ఈత కొలనులు, జిమ్నాషియం వసతులు ఉన్నాయన్నారు. యువ క్రీడాకారులను ప్రతిష్ఠాత్మక లీగ్‌కు సిద్ధం చేయడానికి అనుభవమున్న శిక్షకులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. బీబీఎఫ్‌ఎస్ శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ లీగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో భారత తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారని వివరించారు.

చిత్రదుర్గం జిల్లాకు 9,308 పీఎం ఆవాస్ గృహాలు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : జిల్లాకు 2024-2025 సంవత్సరానికి ప్రధానమంత్రి ఆవాస్ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు 9,308 గృహాలు మంజూరైనట్లు లోక్‌సభ సభ్యుడు గోవింద కారజోళ తెలిపారు. అసెంబ్లీ నియోజవర్గాల వారీగా చిత్రదుర్గానికి 1609, చెళ్లకెరె 1978, హిరియూరు 1389, హొళల్కెరె 1568, హొసదుర్గం 1702, మొళకాల్మూరుకు 1062 గృహాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇల్లు కేటాయించాలని ఎంపీ తెలిపారు.

కరాటే శిక్షకుడికి పురస్కారం



యువతలో ఆత్మ విశ్వాసం పెంపొందేలా కరాటేలో శిక్షణ ఇవ్వడమే కాకుండా క్రమ శిక్షణ నేర్పిన మాస్టర్ రాఘవేంద్ర ప్రతాప్‌సింగ్, కరాటేలో రాణించిన క్రీడాకారుడు జ్ఞాన సింగ్‌కు కృష్ణరాజ ఒడెయరు అవార్డు దక్కడం ప్రశంసనీయమని లోకాయుక్త మాజీ న్యాయమూర్తి సంతోష్ హెగ్డే అన్నారు. ఇక్కడి రవీంద్ర కళాక్షేత్రలో ప్రజాహిత సంరక్షణ ట్రస్ట్, కన్నడ సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వారికి అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. **- న్యూస్‌టుడే, బెంగళూరు (మత్తికెరె)**

కొనసాగుతున్న రామ్‌ప్రసాద్ క్రికెట్ టోర్నీ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక క్రికెట్ సంఘం కె.ఎం.రామప్రసాద్ షీల్డ్ కోసం నిర్వహిస్తున్న మూడో డివిజన్ క్రికెట్ టోర్నీలో వైదేహి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ 28 పరుగుల తేడాతో ఏసీ స్కూల్‌పై విజయం సాధించింది. నగరంలోని వేర్వేరు మైదానాల్లో శుక్రవారం పోటీలు జరిగాయి. మరో పోటీలో విద్యానికేతన్ జట్టు డీపీఎస్-వైట్‌ఫీల్డ్‌పై గెలుపొందింది. ఇతర పోటీల్లో విద్యాభారతి, ఎన్‌పీఎస్ జట్లు వరుసగా ప్రెసిడెన్సీ, జ్యోతి విద్యా కేంద్రియ జట్లపై నెగ్గాయి.

నగరంలో ఈనాడు

● ఉదయం 11 గంటలకు శేషాద్రిపురంలోని జేపీ భవన్‌లో జేడీఎస్ నాయకుల సమావేశం జరుగుతుంది. ఆ పార్టీ శాసనసభ పక్షం నేత సురేష్‌బాబు, మాజీ మంత్రి బండేప్ప కాశంపుర్, యువజన విభాగం అధ్యక్షుడు నిఖిల్‌కుమారస్వామి పాల్గొంటారు. ● ఉదయం 10.30 గంటలకు ల్యావల్లె రహదారి రావ్ మ్యాంగోలో గాల్యాండ్ ఫెస్టివల్ చీరల ప్రదర్శన. ● ఉదయం 10.30 గంటలకు రాజప్రస్థానం మైదానం త్రిపురవాసినిలో జ్యువెలరీ ఆఫ్ ఇండియా ప్రదర్శన. ● సాయంత్రం 5 గంటలకు జేసీ రోడ్డులోని ఏడీఏ రంగ మందిరంలో భువన హొళ్లి రంగ ప్రవేశం. నృత్యదర్శకుడు పార్శ్వనాథ్ ఎస్.ఉపాధ్యాయ, రచయిత డాక్టర్ ఎం.సూర్య ప్రసాద్ పాల్గొంటారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

బంగారు నగల ప్రదర్శన

దసరా, దీపావళి పండగల నేపథ్యంలో నగరంలోని రాజప్రస్థానం మైదానంలోని త్రిపుర నివాస్‌లో జ్యువెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనను ప్రముఖ సినీనటి రాధికా పండిట్, ఎమ్మెల్సీ డాక్టర్ టీఏ శరవణ తదితరులు ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న బంగారు నగలు, వజ్రాభరణాల నమూనాలను ఒక దగ్గర ప్రదర్శిస్తున్నట్లు బెంగళూరు జ్యువెలర్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చేతన్‌కుమార్ మిత్రా తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు 21వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.



- న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

మహిళల నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : భారత నెట్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో ఏషియన్ మహిళల నెట్‌బాల్ పోటీలు ఇక్కడి కోరమంగళ ఇండోర్ క్రీడాప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి పోటీలో ఆతిథ్య భారత జట్టు 55-22 స్కోర్‌తో ప్రత్యర్థి జపాన్‌పై గెలుపొందింది. బి.ఆర్. సౌరభి నాయకత్వంలో భారత జట్టు తొలి పోటీలోనే విజయం సాధించింది. ప్రారంభ వేడుకల్లో ఆసియా నెట్‌బాల్ అధ్యక్షురాలు విక్టోరియాలక్ష్మి, కార్యదర్శి సెల్వియా, సమాఖ్య అధ్యక్షుడు సుమన్‌కౌశిక్, సి.గిరీష్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐజీపీ డి.బి.రవికాంతగౌడను నిర్వాహకులు సత్కరించారు. ఈనెల 27 వరకు ఈ పోటీలు జరగనున్నాయి.



క్రీడాకారిణులను అభినందిస్తున్న విక్టోరియాలక్ష్మి

మహర్షి వాల్మీకి పేరు సముచితం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు విశ్వవిద్యాలయానికి మహర్షి వాల్మీకి పేరు పెట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాయచూరు ఎంపీ కుమార నాయక్, యువజన కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. రామాయణ మహాకావ్యంతో ప్రపంచానికే జ్ఞాన బోధన చేసిన వాల్మీకి పేరు సముచితమన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం కల్యాణ కర్ణాటక సర్వతోముఖాభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తోందని, ఇందులో భాగంగానే రాయచూరు విశ్వవిద్యాలయం విషయంలో సరైన అడుగు వేశారని ప్రశంసించారు. మహర్షి వాల్మీకి పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రిని అభినందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పర్యావరణ హితంగా దీపావళి ఆచరిద్దాం : నితీష్



రాయచూరు, న్యూస్‌టుడే : దీపావళి పర్వదినాన్ని పర్యావరణ హితంగా ఆచరించాలని జిల్లా పాలనాధికారి నితీష్ ఒక ప్రకటనలో కోరారు. బాణసంచా వల్ల కాలుష్యం అధికమై పర్యావరణానికి నష్టం చేస్తుందని, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. పండగ రోజు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు బాణసంచా కాల్చాలని, రాత్రి 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కాల్చడంపై నిషేధం విధించినట్లు వెల్లడించారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వృద్ధాశ్రమాల చుట్టు పక్కల ప్రాంతాల్లో పేల్చరాదని సూచించారు. వ్యాపారులు అనుమతి పొందిన స్థలాల్లో విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న బడిగేరా

బకాయిలు విడుదల చేయాలని వినతి

రాయచూరు, న్యూస్‌టుడే : ఆర్‌టీఈ (రైట్ టు ఎడ్యుకేషన్) చట్టంలో బకాయిలను విడుదల చేయించాలని 'రాయచూరు తాలూకా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం' (రుప్సా) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం తాలూకా అధ్యక్షుడు జంగ్లప్ప గౌడ, ప్రధాన కార్యదర్శి సి.మంజుల నేతృత్వంలో ప్రతినిధులు జిల్లా సార్వజనిక విద్యాశాఖ ఉప నిర్దేశకుడు బడిగేరాకు వినతి పత్రం అందజేశారు. 2020-24 వరకు పాఠశాలలకు రెండు విడతల నిధులు మంజూరు కాలేదని వివరించారు. చెల్లింపుల కోసం సకాలంలోనే దరఖాస్తు చేశారని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనందున నిర్వహణకు త్వరగా విడుదల చేయించాలని విన్నవించారు. కలబురగి విభాగం విద్యాశాఖ సంయుక్త నిర్దేశకుడికి సమస్యను తెలియజేసి, పది రోజుల్లో పరిష్కరించేలా కోరుతానని ఉప నిర్దేశకుడు హామీ ఇచ్చినట్లు జంగ్లప్ప గౌడ తెలిపారు.


హంపనా.. అక్షర విలాసం!

కన్నడ వైభవానికి నిరంతర కృషి



మైసూరు దసరా వేడుకల్లో హంపా నాగరాజయ్యను సత్కరించిన ప్రముఖులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : భాషా శాస్త్రజ్ఞుడు, సాహితీ పరిశోధకుడు, జైన చరిత్ర విజ్ఞానవేత్త ఆచార్య హంపా నాగరాజయ్య కన్నడ సారస్వత లోకానికి ఒక వరంగా కన్నడిగులు భావిస్తారు. 'హంపనా' అనే కావ్యనామంతోనే ఆయన ప్రసిద్ధి చెందారు. కన్నడ సాహిత్య ప్రపంచంలో తనదైన ముద్ర వేశారు. ఆ కృషి ఫలితమే.. ఇటీవల చారిత్రక- ప్రపంచ ప్రఖ్యాత మైసూరు దసరా సంబరాల ముఖ్యఅతిథిగా ప్రభుత్వం ఆయనను ఎన్నుకుని- వేడుకలను ప్రారంభించే అవకాశం పొందారు. చిక్కబళాపుర జిల్లా గౌరీబిదనూరు తాలూకా హంపసంద్ర గ్రామానికి చెందిన పద్మావతమ్మ- పద్మనాభయ్య దంపతులకు ఈ సరస్వతీ పుత్రుడు జన్మించారు. గౌరీబిదనూరు, మండ్య, మధుగిరిలో విద్యనభ్యసించారు. మైసూరులోనే ఆయనకు కువెంపు, డి.ఎల్.నరసింహాచార్, తీనం శ్రీకంఠయ్య, జవరేగౌడ తదితర సాహితీదిగ్గజాల మార్గదర్శనంలో భాషాజ్ఞానం పెంచుకుని స్నాతకోత్తర పట్టా (ఎంఏ) అందుకున్నారు. ఆచార్య ముగళీ ఆధ్వర్యంలో 'వడ్డారాధనే... సమగ్ర అధ్యాయ' అనే అంశంపై పరిశోధక పత్రం సమర్పించి బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ గౌరవం పొందారు.



హంపనా రాసిన గ్రంథాల్లో ఒక ఆణిముత్యం..

● విద్యాభ్యాసానంతరం బోధనారంగంలోకి అడుగుపెట్టారు. మైసూరు మహారాణి కళాశాలలో లెక్చరర్‌గా వృత్తిజీవితాన్ని ప్రారంభించారు. మండ్య, దావణగెరె, శివమొగ్గ, బెంగళూరు కళాశాలల్లో విధులు కొనసాగించారు. ప్రతిభావంత శిష్యులను తీర్చిదిద్దారు. విద్యార్థిలోకానికి అత్యంత ప్రీతిపాత్రుడిగా పేరొందారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ అధ్యయన కేంద్రం ఆచార్యుడిగా, ఆ విభాగ సంచాలకుడిగా, మంగళూరు విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యుడిగానూ, కన్నడ సంస్కృతి శాఖ, జైన పరిశోధన సంస్థ సంచాలకుడిగా, రాష్ట్రకవి కువెంపు ప్రతిష్టాన అధ్యక్షుడిగా సేవలందించారు.

● ప్రస్తుతం.. 88 సంవత్సరాల వయసులో అక్షర విన్యాసంలో తనకు సాటి వరూ లేరనే రీతిలో కలం కదిలిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. కన్నడ సాహిత్యపరిషత్ గౌరవ కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలతో చరిత్ర సృష్టించారు. ఆయన పాలనాకాలంలోనే జానపద, విశ్వకోశ, జానపద వైద్యకోశ (నిఘంటువు), బెళ్లి బిట్ట బళ్లి మాలే, మక్కళ పుస్తక మాలే, సమ్మేళనాధ్యక్షుల భాషణమాలే, హళెగన్నడ కావ్యగళ గద్యానువాద మాలే, కవి కావ్యమాలె.. తదితర 500 గ్రంథాలను ప్రచురించడం ఓ రికార్డు!

● హంపనా సవ్యసాచి రచయితగా గుర్తింపు పొందారు. ఆయన ఏకంగా వందకు పైగా పుస్తకాలను కన్నడ, ఆంగ్ల భాషల్లో రచించారు. పరిశోధన వీరి ప్రథమ లక్ష్యం, భాషా విజ్ఞానం, జానపద అనువాదం, నవలలు, ప్రబంధాలు, బాలసాహిత్య, కావ్యం, విమర్శ, జీవనచరిత్రల అంశాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన రాసిన 'చారు వసంత' అనే మహాకావ్యం ఎంతో ప్రసిద్ధి చెందింది. అనేకానేక భాషల్లోకి ఇది అనువదించారు.

● ఆచార్య హంపనా.. లెక్కలేనన్ని పురస్కారాలు దక్కించుకున్నారు. కన్నడ సాహిత్య అకాడమీ, రాజ్యోత్సవ పురస్కారాలతో పాటు బాలసాహిత్య జాతీయ అవార్డు అందుకున్నారు. చాముండరాయ, కావ్యానంద, పంప, హంపీ విశ్వవిద్యాలయం నాడోజ పురస్కారాలు పొందారు. 'జైనలోక రత్నం' అని ఆయనను కీర్తిస్తారు. జైన సంస్కృతిపై హంపనా అనేకానేక పరిశోధనలు చేయడమే దీనికి కారణం. ఆయన సతీమణి కమలా హంపనా కన్నడ సారస్వత లోకనికి అమూల్య రచనలెన్నో అందించడం ప్రస్తావనార్హం.

పత్తి కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఆందోళన



కార్యాలయం వద్ద బైఠాయించిన అన్నదాతలు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని తాలూకాలు, ఫిర్కా ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను స్థాపించాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాన్ని తెరవాలని కోరుతూ 'అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల జిల్లా సంఘటన' శుక్రవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద బైఠాయించింది. కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సంఘటన ప్రతినిధులు, రైతులు నినాదాలు చేశారు. అనంతరం సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ రూ.5500 నుంచి రూ.7500 పలుకుతోందని, ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా చేతికి రాదని తెలిపారు. అతివృష్టి వల్ల దిగుబడులు కోల్పోయిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ ఆరంభంలోనే ధర లేకపోతే ముగింపు సమయానికి ఇంకా పడిపోయే అవకాశముందని వివరించారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. క్వింటాల్‌కు రూ.10 వేలు ఖరారు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని విశ్లేషించారు. రాష్ట్రం ప్రోత్సాహధనం చెల్లించాలని, సూటు పేరిట కొంత పత్తిని తీసి వేయకుండా వ్యాపారులకు సూచించాలన్నారు. మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పాలనాధికారి ఏపీఎంసీ అధికారులు, రైతులు, పత్తి వ్యాపారులు, రైతు సంఘాలతో సమావేశం జరపాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో దర్శకుడు దీపక్ మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : నటి అమూల్యా సోదరుడు, దర్శకుడు దీపక్ అరస్ (46) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. మనసాలజీ, షుగర్ ఫ్యాక్టరీ సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా ఆయన కోమాలో ఉన్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మల్లేశ్వరం పైప్‌లైన్ రోడ్డులోని నివాసంలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. సాయంత్రం నాలుగు గంటలకు సుమనహళ్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

'కన్నడ సంస్కృతిని కాపాడుకోవాలి'



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్

సిరివార, (మాన్వి) : కన్నడ భాషా సంస్కృతిని, హోదాను కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరి ఊపిరి కన్నడ కావాలని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ ఆకాంక్షించారు. కన్నడ సాహిత్య సమ్మేళన కన్నడజ్యోతి రథానికి పూజలు చేసి భువనేశ్వరి మాతకు ఆయన పూల మాలవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో ఎమ్మెల్యే పాటలకు నృత్యం చేస్తూ.. తహసీల్దార్ రవి ఎస్ అంగడి, నీటి పారుదలశాఖ ఏఈఈ విజయలక్ష్మీ, సీడీపీఓ నాగరత్న నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలతో నృత్యం చేయించారు. తర్వాత ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు భూపనగౌడ, కసపా అధ్యక్షుడు సురేష్ హీరా, స్థానిక ప్రముఖులు చుక్కి సూగప్ప, రమేష్, ఎన్.ఉదయ్‌కుమార్, రంగనాథ్‌నాయక్, శివశరణ, కె.రాఘవేంద్ర, యమునూరప్ప, కన్నడ సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసమే విజయానికి తొలి మెట్టు



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న హుడేద్, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : చిన్నతరహా పరిశ్రమను స్థాపించి అందులో విజయవంతమైన తర్వాతనే పెద్ద పరిశ్రమను నెలకొల్పాలని సిడాక్ సంయుక్త నిర్దేశకుడు జి.యు.హుడేద్ ఔత్సాహికులకు దిశానిర్దేశం చేశారు. నైపుణ్యాభివృద్ధి-ఉద్యమశీలత, జీవనోపాధి శాఖ, కర్ణాటక నైపుణ్య అభివృద్ధి నిగమ, జిల్లా పరిశ్రమల కేంద్రం, సిడాక్ సంయుక్తంగా ఇక్కడి ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాలలో దళిత, గిరిజన నిరుద్యోగులకు ఉద్యమశీలతాభివృద్ధిలో శిక్షణ ప్రారంభమైంది. శుక్రవారం హుడేద్ మొక్కకు నీళ్లు పోసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యాపారంలో నిలదొక్కుకోగలమనే ఆత్మ విశ్వాసం ఉంటే అది విజయానికి తొలిమెట్టు అని తెలిపారు. అతి సాధారణ స్థాయి నుంచి అగ్రస్థానానికి చేరుకున్న పారిశ్రామికవేత్తలను మార్గదర్శంగా తీసుకోవాలని సూచించారు. శిక్షణలో ఏ పరిశ్రమను స్థాపించాలో, వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ పథకాలు, ప్రణాళిక, బ్యాంకుల నుంచి రుణం, ఖాతాల నిర్వహణపై వివరిస్తారని చెప్పారు. జిల్లా ఖాదీ గ్రామోద్యోగ మండలి అధికారి రాయణ్ణ మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో అడుగు పెట్టాలన్నారు. శిక్షణాధికారి నాగరాజు, ఉపన్యాసకుడు రవికుమార్, అభియాన్ మేనేజర్ సురేష్, సంపన్మూల ప్రతినిధులు మనోహర్, మౌనేశ్, రసూల్‌సాబ్ పాల్గొన్నారు.

కిత్తూరు రాణి జయంతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న శివానంద, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో కిత్తూరి రాణి చెన్నమ్మ జయంతిని తప్పనసరిగా ఆచరించాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద నిర్దేశించారు. ఈ మేరకు ఆయా శాఖల ముఖ్యులు అధికారులకు సూచనలు చేయాలని కోరారు. ఈ నెల 23న జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పాలనాధికారి సభాభవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివానంద మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ కూడలి వద్ద చెన్నమ్మ చిత్రపటంతో రంగమందిరం వరకు వెళ్లే ఊరేగింపును ప్రారంభించాలని కోరారు. ఒక రోజు ముందుగానే నగరసభ స్వచ్ఛతా పనులు, తాగునీటి వ్యవస్థను కల్పించాలన్నారు. కిత్తూరి రాణి చరిత్ర గురించి నిపుణుడితో ఉపన్యాసం ఇప్పించాలని, ప్రతిభావంత విద్యార్థులను సన్మానం చేయాలని, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. జయంతిని అర్థ పూర్వకంగా, ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక నిర్దేశకుడు దత్తప్ప సాగూరు, సార్వజనిక విద్యాశాఖకు చెందిన రంగస్వామి, నగరసభ మేనేజర్ రాజు, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా సహ కార్యదర్శి దండప్ప బిరాదార్, రాణి చెన్నమ్మ సామాజికవర్గం ముఖ్యులు హాజరయ్యారు.

అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: కర్ణాటకలోని చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి చెందిన రావూరి శ్రీనివాసులు నాయుడుపై గతంలో అక్రమ ఆస్తుల కేసు నమోదైంది. ఆ కేసును ఆ రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. అందులో భాగంగానే శుక్రవారం సీబీఐ అధికారులు తిరుపతి జిల్లాలోని చంద్రగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ కాపీలను తీసుకున్నారు. తిరుపతి కలెక్టరేట్ పరిధిలో లేఅవుట్లు ఏమైనా వేశారా? అని పరిశీలించారు.

నీరు, మట్టిపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి అరవింద్

మాన్వి, న్యూస్‌టుడే : రైతులు మట్టి, నీటిపై కనీస అవగాహన కలిగి ఉండాలని మైరాడ సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అరవింద్ పేర్కొన్నారు. సిరివార తాలూకాలోని హీరా గ్రామంలో వాటర్‌షెడ్ సలహా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వాటర్‌షెడ్ యోజన వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ యోజన నాలుగు సంవత్సరాల పాటు రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. మట్టిని, నీటిని సంరక్షించుకోవటం, తక్కువ నీటితో సేద్యం చేయటం ఈ యోజన ముఖ్యఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బెంగళూరు మైరాడ అధికారి సుధారామన్, ఉజలాంబె కలబురగి, సంగమేష్ కంబార్, రైతులు, సలహా సమితి సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన ఒక్కూట మహిళా సభ్యులు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

మాన్వి, న్యూస్‌టుడే : ప్రజల్లో పరివర్తన, మహిళల ఆర్థిక స్వావలంబన ధ్యేయంతో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్టు విధులు నిర్వహిస్తోందని ఆ సంస్థ ప్రాదేశిక డైరెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం తాలూకా స్థాయి ఒక్కూట సభ్యుల సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల రైతులు, మహిళలు, యువతీ యువకులకు వివిధ అంశాలపై మార్గదర్శనం, అవగాహన కల్పించి వారి జీవన విధానాల్లో మార్పు తీసుకుని రావటంలో సంస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తక్కువ వడ్డీకి రుణాల మంజూరు సదుపాయం కల్పించినట్లు చెప్పారు. లాభాపేక్ష లేకుండా డాక్టర్ వీరేంద్ర హెగ్గడె, డాక్టర్ హేమావతి హెగ్గడె సంస్థను ముందుకు నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ మోహన్‌నాయక్, తాలూకా యోజనాధికారిణి సరస్వతి ప్రభు, జిల్లా జనజాగృతి సమితి సభ్యుడు మహిబూబ్ మద్లాపూర్, రాయచూరు ఏడీబీ బ్యాంక్ మేనేజర్ విజయకుమార్, వెంకటేశ్, ధర్మస్థల సంస్థ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

నీటిలోనే ఊపిరొదిలిన చేపలు



కాలుష్య ప్రభావంతో కళ్లు తేలేసిన చేపలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నీటి కాలుష్యం కారణంగా భారీగా చేపలు చనిపోయాయి. బెంగళూరు నగరంలోని ఎలక్ట్రానిక్‌సిటీ సమీప చిక్కనాగమంగల చెరువులో వేలాది చేపలు చనిపోయి.. శుక్రవారం నీటిలో తేలాయి. చుట్టుపక్కల నివాసాల నుంచి వచ్చే వ్యర్థనీరే వీటి మరణానికి కారణమని అధికారులు గుర్తించారు. కాలుష్య నియంత్రణ మండలి, పాలికె అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. మృతి చెందిన చేపలను గోతిలో పూడ్చిపెట్టారు. నీటి కాలుష్యమే ఈ దుస్థితికి కారణమని అధికారులు వివరించారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : విధి నిర్వహణలో ఉన్న ఏఎస్సై శివశంకరాచారి (54) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. కామాక్షిపాళ్య ఠాణాలో ఆయన సేవలందిస్తున్నారు. ఉదయం ఠాణాకు వచ్చి, అక్కడి నుంచి గస్తీకి వెళుతున్న సమయంలో శ్వాసతీసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. తక్షణమే చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా మరణించారు. ఆయన మృతికి పలువురు ఉన్నతాధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

చింతనహళ్లిలో గోడకూలి వృద్ధురాలి..

యాదగిరి, న్యూస్‌టుడే : వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇంటి పునాదుల్లోకి నీరు వెళ్లి గోడ కూలిన ఘటనలో గుంజాలమ్మ (68) అనే వృద్ధురాలు మరణించింది. ఆమె సోదరుడు చిన్నపాటి గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. గురుమఠకల్ తాలూకా చింతనహళ్లి గ్రామంలో శుక్రవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. గురుమఠకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ప్రహ్లాద జోషికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

జోషిని బర్తరఫ్ చేయండి..

బెంగళూరు (శివాజీనగర): కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ కేపీసీసీ ప్రతినిధులు శుక్రవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. లోక్‌సభకు భాజపా నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామని మాజీ ఎమ్మెల్యే చౌహాన్‌ను ఆయన సోదరుడు, సోదరి, మేనల్లుడు వంచించారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్ ఆరోపించారు. జోషి నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయకపోతే..నరేంద్రమోదీ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను వెనుక నుంచి తప్పులు చేయిస్తూ.. కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు జోషి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతినిధులు పుట్టరాజు, ఉమేశ్, హేమరాజు, కుశాల్, హరువూగౌడ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

18-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.93	1612.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	36,919	657
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	36,799	10,534
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.788	43.808

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నేడు 'అసురరు' ట్రైలర్ ప్రదర్శన



పాత్రికేయులకు వివరిస్తున్న రాజ బహదర్

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 8న విడుదల అవుతున్న అసురరు కన్నడ సినిమా ట్రైలర్‌ను శనివారం రాత్రి రంగమందిరంలో ప్రదర్శిస్తున్నామని, పాటలను విడుదల చేస్తామని నిర్మాత, డైరెక్టర్ రాజ బహదూర్ వెల్లడించారు. ఆయన శుక్రవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, రాజకీయ పార్టీల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నేరాలు చేసే వారు, అక్రమాలకు పాల్పడే వారు చట్టం నుంచి తప్పించుకోవచ్చునేమో కాని దేవుడి నుంచి తప్పించుకోవడం అసాధ్యమనే సందేశం ఈ చిత్రంలో ఉందన్నారు. సినిమాలో గాయకవాడ్, సుప్రియా రాజ్, తమ్మణ్ణ, తిప్పణ్ణ, మల్లికార్జున తదితరులు నటించారని వివరించారు. రాయచూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగిందని తెలిపారు. ట్రైలర్‌ను ప్రేక్షకులు వీక్షించాలని కోరారు.

అసోం వాసి ఆత్మహత్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆనేకల్ సమీపంలోని ఇండ్లవాడి క్రాస్‌లో ఉంటున్న ఇబ్రాజ్ గురుంగ (49) అనే వ్యక్తి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అసోంకు చెందిన తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఉంటున్న అతను ఫ్యూచర్ కిచెన్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనేకల్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు,

బంగ్లా పౌరుల నిర్బంధం

శివమొగ్గ, న్యూస్‌టుడే : శివమొగ్గ నగరంలో అక్రమంగా ఉంటున్న ఎనిమిది మంది బంగ్లా పౌరులను సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. మహ్మద్ మాణిక్, హకీం అలి, సుజోన్, ఇస్మాయిల్, కరీం, సలాం, రాజికుల్, ఉస్మాన్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహ్మద్ మాణిక్ మొదట దొరికిపోయాడు. ఆ వ్యక్తిని విచారించగా మిగిలిన వారి పేర్లు చెప్పాడు. నకిలీ ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులను వీరు చేయించుకున్నారు. భవన నిర్మాణ పనుల కోసం ఉస్మాన్ వీరిని అక్రమ మార్గంలో బంగ్లాదేశ్ నుంచి శివమొగ్గకు తీసుకువచ్చాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

మద్యం తాగించి.. విద్యార్థినులకు నరకం

రామనగర, న్యూస్‌టుడే : కనకపురలోని ఒక కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులతో బలవంతంగా మద్యం తాగించి ముగ్గురు లెక్చరర్లు వేధించారనే సమాచారం కలకలం రేపుతోంది. ఒక గదిలో వారిని ఉంచి తమతో కలిసి నృత్యాలు చేయాలని ఒత్తిడి చేశారని సమాచారం. ఆ వివరాల్లోకి వెళితే.. అక్టోబరు ఐదు నుంచి పది వరకు కళాశాల నుంచి విద్యార్థులను మడికేరి పర్యటనకు తీసుకువెళ్లారు. అక్టోబరు తొమ్మిది రాత్రి విద్యార్థినులను తమ గదికి పిలిపించుకుని వారితో మద్యం తాగమని ఒత్తిడి చేశారు. మద్యం తాగిన అనంతరం నృత్యం చేయాలని బలవంతం చేశారు. బాధిత విద్యార్థినులు తరువాత మేల్కొని.. సమస్యను కుటుంబ సభ్యులకు ఆలస్యంగా వివరించారు. బాధితుల ఫిర్యాదుతో కనకపుర ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కళాశాల లెక్చరర్లు విశ్వనాథ్, లక్ష్మీశ్, నాగేశ్‌లపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల రక్షణ కమిషన్ సంబంధిత కళాశాల యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది.



లోపల ఈడీ సోదాలు.. బయట కేంద్ర బలగాల భద్రత

ముడా.. ఈడీ దడ

అధికారుల విస్తృత దాడులు



విలేకరులతో మాట్లాడుతున్న ఈడీ అధికారి

మైసూరు, న్యూస్‌టుడే : ఉప ఎన్నికల ఢంకా మోగిన వేళ.. రాష్ట్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థ దాడులు రాజకీయ చర్చకు తావిచ్చాయి. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో ఇళ్ల స్థలాల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఫిర్యాదులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు స్పందించారు. ముడా కార్యాలయం, ఇళ్ల స్థలాల కేటాయింపులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవరాజు (ఏ4) నివాసంపై 12 మంది అధికారులు దాడులు చేసి, సోదాలు చేసుకుని, కొన్ని దస్త్రాలను తీసుకెళ్లారు. ముడాలో అక్రమాలు జరిగాయని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇప్పటికే ఫిర్యాదు చేశారు. భద్రత కోసం పోలీసులు, 20కు పైగా సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. కార్యాలయ ప్రహరీ వద్ద ఉన్న గేటుకు తాళం వేసి, ప్రజలు అక్కడకు రాకుండా అడ్డుకున్నారు. తాము కోరిన దాఖాలు ఇవ్వాలని ఈడీ ఇప్పటికే మూడు నోటీసులు, ఒకసారి సమన్లు జారీ చేసినా అధికారులు బదులివ్వకపోవడంతో వారే కార్యాలయానికి చేరుకున్నారు. అక్రమాలకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవరాజుకు బెంగళూరు శివారు ప్రాంతం కెంగేరిలోని నివాసం, మైసూరు తహసీల్దారు కార్యాలయంపైనా దాడి చేసి సోదాలు నిర్వహించారు. ఈడీ అధికారులకు తాము పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని ముడా కార్యదర్శి ప్రసన్న తెలిపారు. నకలు ప్రతులు వద్దని, ఒరిజినల్ పత్రాలు ఇవ్వాలని ఈడీ అధికారులు కోరారని చెప్పారు. శనివారం మరోసారి సోదాలు చేస్తామని అధికారులు తమకు చెప్పారని తెలిపారు.

రాజకీయ ప్రేరితం కాదు

ముడా కార్యాలయంపై ఈడీ దాడి రాజకీయ ప్రేరితం కాదని విపక్ష నేత ఆర్.అశోక్ బెంగళూరులో వ్యాఖ్యానించారు. ముడా అక్రమాలపై స్నేహమయి కృష్ణ ఇప్పటికే గవర్నర్, లోకాయుక్త, ఈడీ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఏ1గా, ఆయన భార్య పార్వతి ఏ2గా ఉన్న కేసుకు సంబంధించి, దర్యాప్తులో భాగంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు.

ఎన్నికల నేపథ్యం..

ఉప ఎన్నికల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలతో కేంద్రం దాడులు చేయిస్తున్నట్లు కేపీసీసీ అధికార ప్రతినిధి లక్ష్మణ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఇబ్బంది పెట్టేందుకే దాడులు జరిగాయన్నారు. ఇప్పటికే లోకాయుక్త దర్యాప్తు చేస్తున్న కేసులో ఈడీ జోక్యం ఎందుకని ప్రశ్నించారు. నగదు లావాదేవీల ఆరోపణలే లేనప్పుడు ఈడీ దాడి చేయడం సరికాదని మైసూరులో విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు.